

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 01-01-2023 సంపుటి : 04 సంచిక : 116 పేజీలు : 4 వెల : రూ 3-00

## భారత్ జోడో యాత్ర బుల్లెట్ ప్రూఫ్ కారులో చేసేది కాదు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఢిల్లీలో భారత్ జోడో యాత్ర నిర్వహించినప్పుడు భద్రతా వైఫల్యాలపై ఆ పార్టీ ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.దీనిపై స్పందిన సీఆర్‌పీఎఫ్ రాహులే నిబంధనలు ఉల్లంఘించారని బదులిచ్చింది.తాజాగా రాహుల్ గాంధీ ఈ విషయంపై స్పందించారు. తాను బుల్లెట్ ప్రూఫ్ కారులో తిరుగుతూ భారత్ జోడో యాత్రలో పాల్గొనలా? అని ప్రశ్నించారు. అది ఎలా సాధ్యమని వ్యాఖ్యానించారు.బీజేపీ నేతలు బుల్లెట్ ప్రూఫ్ కార్లను విస్మరించి నిబంధనలను తుంగలో తొక్కినప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వ్యక్తులను, పార్టీలను బట్టి ప్రోటోకాల్స్ మారుతాయా అని నిలదీశారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.భారత్ జోడో యాత్ర దేశ భావోద్వేగాలకు సంబంధించిందని, తనకు చాలా విషయాలు నేర్పిందని రాహుల్ అన్నారు. తాను ఊహించిన దానికంటే ఎక్కువే నేర్చుకున్నట్లు పేర్కొన్నారు.అలాగే 2024లో ప్రతిపక్షాలు అన్నీ ఏకమైతే బీజేపీ గెలవడం కష్టం అన్నారు రాహుల్. ప్రతిపక్షాలు ప్రత్యామ్నాయ విజన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. అయితే కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి ఎవరు? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. తన దృష్టంతా విద్వేషం, ఆగ్రహావేశాలపై పోరాడటమేనని పేర్కొన్నారు.

## కొత్త ఇంచార్జ్ డీజీపీగా అంజనీకుమార్

హైదరాబాద్ తెలంగాణరాష్ట్ర కొత్త ఇం చార్జ్ డీజీపీగా అంజనీకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రోజు పదవీ విరమణ చేసిన మహేందర్ రెడ్డి నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కొత్త డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అంజనీ కుమార్ కుపలువురు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. డీజీపీగా మహేంద్రరెడ్డి పదవీ కాలం నేటితో ముగియడంతో ఆయన స్థానంలోఅంజనీకుమార్ ను ఇంఛార్జ్ డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిని విషయం తెలిసిందే. అంజనీ కుమార్ మాట్లాడుతూ మహేందర్ రెడ్డితో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు అంజనీకుమార్ చెప్పారు. ఇలాంటి అధికారులు అరుదుగా ఉంటారని, ఎన్నో రకాలుగా మహేందర్ రెడ్డి తనకు ఆదర్శమన్నారు. ఆయన హయాంలో టెక్నాలజీ వ్యవస్థ అభివృద్ధి చెందిందని కొనియాడారు. ప్రతి అధికారి లీడర్గా పనిచేయాలని సూచించారు.1990 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన అంజనీకుమార్.. అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. వరంగల్ జిల్లా జనగామ ఏఎస్పీగా తొలి పోస్టింగ్ పొందారు. ఆ తరువాత మహబూబ్నగర్, ప్రకాశం, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలందించారు. 1998లో ఐక్య రాజ్య సమితి శాంతిపరిరక్షక దళానికి ఎంపికై బోస్నియా–హెర్జిగోవినాలో సంవత్సరంపాటు విధులు నిర్వర్తించారు.

## పచ్చ ప్రకోపానికి ఇదే సరైన మందు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రోజు, రోజుకు తన ప్రసంగాలలో పదును తేలుతున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రతిరోజూ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ షూటింగ్ గ్యాప్‌లో ఆదివారం రోజు చేసే చేసే విమర్శలకు ఆయన వారానికి ఒక్కసారి తన కార్యక్రమంలో తిప్పికొడు తున్న తీరు ప్రభావవంతంగా ఉంటోందని చెప్పాలి.చంద్రబాబు.. రోజూ చేసే దూషణ లన్నిటినీ జగన్ ఒక్క గంటలో ఘాటుగా జవాబిస్తున్నారు. అందులో చమత్కారం, ఎద్దేవ కలగలిసి ఉండి సభికులను ఆకట్టుకుంటున్నాయని చెప్పాలి.కందు కూరులో చంద్రబాబు సభలో తొక్కిసలాట జరిగి ఎనిమిది మంది మరణించిన సంగతి తెలిసిందే. అయినా చంద్రబాబు తన పద్దతి మార్చుకోలేదు. సభలను ఆపకపోగా, ఇతర పట్టణాలలో కూడా అవే ఇరుకు రోడ్లలో సభలు పెడుతున్నారు. పైగా చచ్చిపోయినవారిలో బిసిలు ఎక్కువగా ఉన్నారంటూ, కనుక తన సభకు బిసిలు ఎక్కువమంది వస్తున్నారని లెక్కలేసు కునే దారుణ స్థితికి చంద్రబాబు రాజకీయం చేరింది. వచ్చినవారిలో పలువురు కూలీకి వచ్చామని ఓపెన్‌గానే చెబుతు న్నారు.ముఖ్యమంత్రి జగన్ సభకు బస్‌లలో తరలించారని, ఉపాధి హామీ కూలీలను తీసుకు వచ్చారని ప్రచారం చేసే తెలుగు దేశం పత్రిక ఈనాడు, మరి చంద్రబాబు సభకు ఎలా తీసుకు వచ్చింది ఎందుకు రాయడం లేదు? యథా ప్రకారం ఇరుకు రోడ్ల పోటోలను చూపి భారీగా తరలి వచ్చారని ఎందుకు ప్రచారం చేస్తోంది. చంద్రబాబు సభలను గమనించినా, ఈనాడు, తదితర టిడిపి మీడియాలను గమనించినా కందుకూరులో ఎలాంటి ఘటన జరగలేదేమో, అంతా సజావుగానే ఉందేమో అన్న భ్రమ కలుగుతుంది. ఎందుకంటే టిడిపి సభలో ఎనిమిది మంది మరణించిన ఘటనను అంతా మర్చిపో వాలని వారి అభిలాష అన్నమాట.ఈ నేపథ్యంలో జగన్ నర్సీపట్నం సభను పరిశీలించండి. సభకు వచ్చిన జనాన్ని చూడండి. సభా ప్రాంగణం చాలక బయట కూడా కిక్కిరిసిపోయిన జనం కనిపిస్తారు. అయినా ఈనాడు మాత్రం వచ్చినవారు అలా వచ్చారు? ఇలా వెళ్లారు.. పులిహోరా వదలివేశారు.. అంటూ పులిహోర వార్తలు వేస్తోంది. చంద్రబాబు సభను రోడ్డు మధ్యలో పెడితే ప్రజలకు ఎవరికి అసౌకర్యం కలగలేదన్నమాట. ట్రాఫిక్ ఎక్కడా ఆగలేదన్నమాట. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన సభలకే కాదు.. అమరావతిలో పిచ్చి మొక్కలు చూపించడానికి, పోలవరం లో అసంపూర్తి కట్టడాలు చూపించడానికి, జయము జయము చంద్రన్న అని పాడించడానికి జనాన్ని తరలించినప్పుడు ఈనాడు వారి కన్నులకు పండగగాను, చెవులకు శ్రావ్యంగానూ ఉన్నాయన్నమాట. ఈ పత్రిక దిగజారుడుతనం గురించి రోజూ చెప్పుకున్నా చాలడం లేదు.మరో వైపు జగన్ ప్రసంగానికి వస్తున్న స్పందన చూడండి. ఆయన విసిరిన వ్యంగ్యోక్తులు పేలుతున్నాయి. రాజకీయం అంటే డ్రోన్ షాట్లు, డైలాగులు చెప్పడం కాదు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడం, నిరుపేదల కష్టాన్ని తీర్చి వారికి అండగా ఉండడం అని ఆయన తేల్చి చెప్పారు. కందుకూరులో చంద్రబాబు తన డ్రోన్ షాట్‌ల కోసం అంతమందిని బలితీసుకున్నారని ఆయన చెబుతూనే రాజకీయం ఎందుకోసమో వివరించారు. చంద్రబాబు సభలపై ఆయన వ్యాఖ్యానిస్తూ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అని తిప్పికొట్టారు. గతంలో గోదావరి పుష్కరాలలో 29 మంది మరణించిన ఘట్టాన్ని కూడా ఆయన గుర్తు చేశారు.అసలు చంద్రబాబు సభలకు ఎందుకు జనం వస్తారు అంటూ పలు ప్రశ్నలు సంధించారు. లక్ష కోట్ల రుణాలను మాఫీ చేస్తానని ఎగ్గొట్టినందుకా? డ్వాక్రా మహిళలను మోసం చేసినందుకా? బిసిలను, ఎస్సిలను అవమానించినందుకా అంటూ అంటూ జగన్ పలు ప్రశ్నలు సంధించిన తీరు సున్నితంగా కనిపించినా, చంద్రబాబు నషాళానికి అంటే ఘాటు వంటిదే అని చెప్పాలి. కాకపోతే చంద్రబాబు వీటిని పట్టించుకోవడం ఎప్పుడో మానేశారు కనుక ఆయనకు ఆ బాధ ఉండదు. అందుకే జగన్ విమర్శలకు ఆయన జవాబు ఇవ్వకుండా తన దూషణలను మాత్రం కొనసాగిస్తుంటారు. జగన్ చెప్పిన మాటలలో కొన్నిటికైనా చంద్రబాబు రిప్లై ఇచ్చే పరిస్థితి లేకపోవడం తెలుగుదేశం దయనీయ పరిస్థితికి దర్పణం అని చెప్పాలి.




## ఏపీలో జనవరి1 నుంచి పెన్షన్ వారోత్సవాలు

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో జనవరి 1వ తేదీ నుంచి పెంచిన పెన్షన్ పంపిణీ ప్రారంభం కానుంది. మొత్తం రూ. 2,750ని లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయనున్నారు.అంతేగాక రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నుంచి వారం రోజుల పాటు పెన్షన్ వారోత్సవాలు నిర్వహించనున్నారు. కొత్తగా 2 లక్షల 31 వేల మందికి ఏపీ ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేసింది. ఫలితంగా దేశంలో అత్యధికంగా 64 లక్షల మందికి పైగా ఏపీలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వంగా సీఎం జగన్ సర్కార్ నిలిచింది.జనవరి 3న రాజమండ్రిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. కాగా ఇప్పటి వరకు రూ. 2,500 ఉన్న పెన్షన్‌ను 2,750కు పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఈటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పెరిగిన మొత్తాన్ని జనవరి 1 నుంచి లబ్ధిదారులకు అందజేయనుంది.



## జనంలో ఆందోళన, అభద్రతా భావం ఉంది

### చంద్రబాబు నాయుడు



నెల్లూరు నెల్లూరు జిల్లా కోవూరు లో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు మీడియా తో మాట్లాడారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతున్నాం. బాదుడు, విద్వేషాలు, విషాదాలు, విధ్వంసాల సంవత్సరంగా ఈ ఏడాది మిగిలిపోయింది. ప్రతివ్యక్తీ శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా క్షోభ అనుభవించారు. ప్రభుత్వ పాలసీల కారణంగా అన్ని వర్గాలు ఇబ్బందులు పడ్డాయి. ప్రశ్నించిన వారిపై దాడులు చేసి, అక్రమంగా కేసులు పెట్టారు. ఇవన్నీ ప్రజల్ని క్షోభలోకి నెట్టాయి. జగన్ ను సైకో అని ఏదో మాట కోసం అనడంలేదు. అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతుంటే జగన్, అతని టీం ఆనంద పడుతున్నారు. మీడియాను కొట్టి ఆనందం పొందుతున్నాడు...సీఐడీ కేసులతో వేధింపులకు పాల్పడుతున్నాడు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు, కరెంట్ చార్జీలు మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయి.పెంచిన ధరలు, పన్నులతో ప్రజలపై పెనుభారం మోపారు.దేశంలో రైతులపై అత్యధిక అప్పున్న రాష్ట్రం ఏపీనే. ఒక్కో రైతుపై సగటున రూ.2.42 లక్షల అప్పు ఉంది.ప్రతి రైతూ అప్పుల్లో ఉన్నాడు. రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానం.. కౌలు రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో రాష్ట్రం ఉంది. అధికారికంగానే 1,673 మంది రైతుల అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారు. మనిషి అనే వాడు కనీసం ఆలోచిస్తాడు.. కానీ ఈ సిఎం ఆలోచన కూడా చేయడం లేదు.ఒక క్వింటా ధాన్యానికి 25 కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. రేషన్ బియ్యం మొత్తం రీసైక్లింగ్ చేసి తరలిస్తున్నారు.రేషన్ బియ్యం ఇచ్చిన వెంటనే కలెక్ట్ చేసి పోర్టుల ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు.కేంద్రం ఇచ్చిన బియ్యం కూడా పంపిణీ చేయలేదు. రాష్ట్రంలో బియ్యం తరలింపు జరిగిందన్న విషయాన్ని పార్లమెంట్లో స్వయంగా కేంద్ర మంత్రి చెప్పారు.

రాష్ట్రంలో అన్ని చోట్లా గంజాయి, డ్రగ్స్ సరఫరా జరుగుతోంది. మద్యం రేట్లు పెరిగాయి కాబట్టి తాగలేక...మందుబాబులు గంజాయికి అలవాటు పడుతున్నారు. సీ ఎం ఎందుకు ఇంత తీవ్రమైన అంశంపై స్పందించడం లేదు.? దున్నరేళ్లలో రాష్ట్రంలో మహిళలపై 52 వేల దాడులు, వేధింపుల ఘటనలు జరిగాయి. నెల్లూరు లాంటి జిల్లాలో 11 మందిపై వివిధ రకాల అఘాయిత్యాలు జరిగాయి. ఒక పోలీసు 5 ప్రాణాలు పోవడానికి కారణం అయితే మీడియా ఏమైంది.? ప్రజలు ఎందుకు ప్రశ్నించలేదు. ఇవి దారుణ పరిస్థితులు కాదా?ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ప్రజలు తమకు అన్వయించుకున్నారు. కార్యక్రమం అందుకే విజయవంతమైంది. నా జీవితంలో ఎప్పుడూ చూడనంతగా జనం తరలి వస్తున్నారు. జనంలో ఆందోళన, అభద్రతా భావం ఉంది. అందుకే మా సభలకు జనం తరలి వస్తున్నారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది....వైసీపీ నేతలను హెచ్చరిస్తున్నా. జగన్ ను సైకో అంటే నేను తిట్టడం కాదు....అతని తీరు చూసి చెపుతున్నా. అవినీతి పరుడు రూ.100కోట్లో రూ.500 కోట్లో దోచుకుంటాడు...అయితే అన్ని వ్యవస్థలను విధ్వంసం చేస్తూ నిర్వీర్యం చేస్తున్నాడు. నేను కుప్పం వెళితే మా వాళ్లపై 75 మందిపై కేసులు పెట్టారు. వాటికి భయపడితే మనం ఇలాగే మిగలిపోతాం. 2022 విధ్వంసాలు, అరాచకాలతో ముగిసింది. 2023 ఒక ఆశ, పెనుమార్పులకు కారణం అవుతుందని అన్నారు.వైసీపీలో ఉన్న నాయకులు సైతం ఆలోచనలో పడ్డారు. రాష్ట్రంపై గౌరవం ఉన్న నాయకులు వైసీపీలో కూడా ఇక కొనసాగలేరు. వారిలోనూ చర్చ మొదలైంది. స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసిన పార్టీలో వైసీపీ సర్పంచులు, ఎంపీటీ, జడ్పీటీలు ఎందుకు ఉండాలి.? వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది. ఎవరూ ఛాలెంజ్ చెయ్యరు అనుకున్న వాళ్లను ప్రజలే చాలెంజ్ చెయ్యడంతో వైసీపీలో కలవరపాటు మొదలైంది ముందుస్తుపైనా జగన్ రెడ్డి ఆలోచనలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రధాని మోడీని కలిసిన జగన్ దేనిపై చర్చించారు.? ఢిల్లీ వెళ్లిన జగన్ రెడ్డి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ గురించి అడిగాడా.? తన కేసుల కోసం రాజ్యసభ స్థానాలను అమ్ముకున్న వ్యక్తి సీఎం జగన్ రెడ్డి. జగన్ ఓటుకు రూ.10 వేలు ఇస్తాడట..ఎన్ని చేసిన ప్రజలు అన్ స్టాపబుల్...టీడీపీ అన్ స్టాపబుల్. మాకు అధికారం అన్ స్టాపబుల్. ప్రజాస్వామ్యంలో ఉన్న నేతలు....ప్రతిపక్షాల పాదయాత్రలు అడ్డుకుంటాం అంటున్నారు..అంటే వాళ్లు సైకోలు అనే కదా? జగన్ అజ్ఞానానికి..అమాకత్వానికి ఏం చెపుతాం.? గోపిచంద్ అకాడమీకి స్థలం ఎవరు ఇచ్చారు.? నేను ఇచ్చిన 5 ఎకరాల్లో పెట్టిన అకాడామీలో సింధు ఆట నేర్చుకుందన్న విషయాన్ని జగన్ తెలుసుకోవాలి.

## మూడు రాజధానులు కాదు...

### మూడు రాష్ట్రాల నినాదం

విజయవాడ, డిసెంబర్ 31, ఆంధ్రప్రదేశ్ లో మూడు రాజధానుల వివాదం కాస్తా మూడు రాష్ట్రాల వివాదంగా మారుతోంది. ఏపీని మూడు రాష్ట్రాలుగా విభజించాలన్న డిమాండ్ పెరుగుతోంది. విశాఖను రాజధానిగా అంగీకరించకపోతే ఉత్తరాంధ్రను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఇప్పుడు ధర్మాన ప్రసాదరావుకు పోటీగరాయలసీమ నేతలు కూడా.. ప్రత్యేక రాష్ట్ర డి?మాండ్ చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా పలువురు నేతలు రాయలసీమలో రాజధాని పెట్టాలని లేకపోతే ప్రత్యేక రాష్ట్రం పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రాను రాను ఈ వివాదం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ధర్మాన విశాఖపట్నాన్ని రాజధానిగా చేయాల్సిందేనని.. లేని పక్షంలో కొత్త రాష్ట్రంగానైనా ప్రకటించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆదాయం మొత్తం ఖర్చుపెట్టి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాక.. విభజనతో విడిచిపెట్టి వచ్చాం అన్నారు. ఆ పొరపాటు పునరావృతమైతే మరో 70 ఏళ్లు ఈ ప్రాంతం వెనుకబాటుతోనే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రలో తిరుగుతూ అమరావతి రాజధాని అని చంద్రబాబు చెప్పడం మన చేతులతో మన కళ్లనే పొడిచే ప్రయత్నమే అన్నారు. చంద్రబాబు అమరావతి రాజధాని అని చెబుతున్నారని అదే జరిగితే మాకు విశాఖ రాజధాని ఇచ్చేయండి మేము ఒక చిన్న రాష్ట్రం ఏర్పాటు చేసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు.ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యలపై రాయలసీమ నేతలు స్పందించారు. బీజేపీకి చెందిన బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీకి చెందిన శ్రీనివాసలరెడ్డి తనకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానుల వివాదం కారణంగా మూడు ప్రాంతాల మధ్య .. ప్రత్యేక రాష్ట్ర వాదం బలపడుతున్న సూచనలు వీరి కారణంగా కనిపిస్తోంది. అటు రాయలసీమలో.. ఇటు ఉత్తారంధ్ర రాజకీయ నేతలు... తమ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా కావాలనుకుంటున్నారు. మధ్యలో కోస్తా ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కావాలని కానీ వద్దని కానీ అడిగే అవకాశం ఉండదు. అలాగే...కలిపి ఉంచాలని వారు ఉద్యమాలు కూడా చేయరన్న వాదన ఉంది. దీంతో మూడు ప్రాంతాలను మూడు రాష్ట్రాలు చేయాలనే డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టింది. అమరావతిని రాజధానిగా నిర్ణయించారు. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ఏకగ్రీవంగా అంగీకరించారు. రైతులు కూడా ముప్పై మూడు వేల ఎకరాలిచ్చారు. అమరావతిని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఒక్కరంటే ఒక్కరూ వ్యతిరేకించలేదు. అటు రాయలసీమలో కానీ ఇటు ఉత్తరాంధ్రలో కానీ తమ ప్రాంతానికి రాజధాని కావాలని ఒక్కరూ అడగలేదు. రాష్ట్రం మధ్యలో రాజధాని అంటే అందరూ బాగుందని అనుకున్నారు. సాక్షాత్తూ అసెంబ్లీలోనే జగన్ .. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఇష్టం లేక అమరావతికి అంగీకరిస్తున్నానన్నారు. తన అంగీకారానికి గుర్తుగా ఇల్లు కట్టుకున్నామని చెప్పారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ప్రజల ఆకాంక్షల మరేకంటే మూడు రాజధానుల ప్రస్తావన తెచ్చారు. దీంతో మూడు ప్రాంతాల ప్రజల మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి.

# సంపాదకీయం

ఆదివారం 01 -01-2023

## చైనాను నమ్మేదెలా...

భారత్, చైనా, దేశాల సంబంధాలను నిదానంగా, పటిష్ఠంగా మెరుగుపరచుకోడం కోసం ఇండియాతో కలిసి పని చేయడానికి తాము సిద్ధంగా వున్నామని ఆయన చేసిన ప్రకటనపై ఏ మాత్రం విశ్వాసం కలుగదు. 2020 జూన్‌లో లడఖ్ గాల్వాన్ లోయ వద్ద పెను ఘర్షణ సంభవించినప్పటి ఆక్రమిత ప్రాంతాల నుంచి రెండు దేశాల సేనలు వెనుకకు మళ్ళే విషయమై ఒక వైపు చర్చలు జరుగుతుండగానే అరుణాచల్ వద్ద చైనా రెచ్చిపోడాన్ని ఏమని అర్థం చేసుకోవాలి? యాంగ్ త్సే ఘటన తర్వాతనే గాల్వాన్ లోయ వివాద పరిష్కారం దిశగా 17వ రౌండ్ చర్చలు చైనా వైపు గల చుసుల్ మోల్డో సరిహద్దు పాయింట్ వద్ద జరిగాయి. ఈ చర్చల తర్వాతనే ఈ నెల 25న వాంగ్ యీ సుహృద్భావ ప్రకటన వెలువడింది. ఈ రెండు సందర్భాల్లోనూ యాంగ్ త్సే ఘర్షణ ప్రస్తావన రాకపోడం విశేషం. వాస్తవానికి తవాంగ్ సెక్టార్‌లో రెండు దేశాల సేనల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయని ఈ నెల 9వ తేదీ నాటి సంఘటనే బయటకు పొక్కిందని సమాచారం. అరుణాచల్‌ప్రదేశ్ వద్ద రెండు దేశాల సైన్యాల మధ్య బాహాబాహీ ఘర్షణలు ఇటీవల తరచూ జరుగుతున్నాయని ఒక సైన్యాధికారే చెప్పినట్టు తెలిసింది. సగటున నెలకు రెండు మూడు సార్లయినా సేనలు తలపడుతున్నట్టు ఆ సైన్యాధికారి చెప్పారు. అయితే ఈ నెల 9 నాటి ఘర్షణ తర్వాత రెండు సైన్యాల అధికారుల మధ్య చర్చలు జరగడం వెంటనే ఆ నిప్పు చల్లారిపోడం సంతోషదాయకం. వాస్తవాధీన రేఖ వద్ద రెండు దేశాల సైన్యాలు తుపాకులను, మందుగుండును ఉపయోగించరాదని 1996లో ఒక ఒప్పందం కుదిరింది. అందుకే వీధి కొట్లాటల మాదిరి సరిహద్దు ఘర్షణలు. అయితే ఇలా చీటికిమాటికీ తంపులకు దిగే రెండు దేశాల మధ్య శాంతి ఎంత కాలం నిలబడుతుందనే సందేహం సహజంగానే కలుగుతుంది. 2020 ఘర్షణలో చైనా సేనలు ముందుకు చొచ్చుకొచ్చి భారత భూభాగాన్ని కొంత మేర స్వాధీనం చేసుకొన్నట్టు వార్తలు వెల్లడించాయి. ఈ సంఘర్షణల తర్వాత భారత దేశం ఆ ప్రాంతంలో 50 నుంచి 60 వేల మంది సైనికులను మోహరించిందని తెలుస్తున్నది. అలాగే సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇలా సరిహద్దులను భారీ మోహరింపులతో కాపాడుకోడం చాలా ఖర్చుతో కూడుకొన్న పని. 17 రౌండ్ల చర్చలు జరిగినా గాల్వాన్ లోయ కొట్లాట పేచీ పరిష్కారానికి నోచుకోలేదు. ఒకటి రెండు చోట్ల సైన్యం వెనుదిరగడం జరిగినా ఇంకా వివాదాస్పద పాయింట్లు మిగిలే వున్నాయి. జులైలో 16వ విడత చర్చలు జరిగిన తర్వాత సెప్టెంబర్ 8న గోగ్రా హాట్ స్ప్రింగ్స్ అనే చోట రెండు దేశాలు సైనిక ఉపసంహరణను ప్రారంభించాయి. అయితే ఇంకా దౌలత్ బేగ్ వోల్డీలోని దేప్‌సంగ్ వద్ద, దెమ్‌చోక్ సెక్టార్‌లో చార్డింగ్ నల్లా వద్ద ఉపసంహరణలు జరగవలసి వున్నాయి. ఇక్కడే భారీ సంఖ్యలో రెండు దేశాల సేనలు మోహరించినట్టు తెలుస్తున్నది. వాస్తవాధీన రేఖ వద్ద యథాతథ స్థితిని చైనా సైన్యం ఏకపక్షంగా మార్చడాన్ని ఎంత మాత్రం అనుమతించబోమని మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ నాడు ప్రకటించారు. అమెరికాతో ఇండియా సన్నిహితంగా వుండడం చైనాకు గిట్టడం లేదు. ఈ మధ్య ఉత్తరాఖండ్ వద్ద చైనాతో గల సరిహద్దుల్లో అమెరికాతో కలిసి భారత సైన్యాలు సంయుక్త విన్యాసాలు జరపడం చైనాకు కంటగింపుగా వున్నది. బహుశా దీని ప్రేరణతోనే ఇటీవలి తవాంగ్ సెక్టార్ ఘటన జరిగి వుండవచ్చు. సన్నిహితంగా వున్నప్పటికీ ఉక్రెయిన్ యుద్ధం విషయంలో అడుగుల్లో ఇండియా అడుగులు వేయలేదు. స్వతంత్రమైన వైఖరిని తీసుకొన్నది. చైనా దీనిని గమనించకపోడం బాధాకరం. పసిఫిక్ మహా సముద్రంలో క్వాడ్ ఒప్పందం ద్వారా తనకు వ్యతిరేకంగా అమెరికాతో ఇండియా కుమ్మక్కయిందనే దుగ్ధ చైనాకున్నది. వాస్తవాధీన రేఖను మార్చివేసి భారత ఆధీనంలో వున్న ప్రాంతాలను ఆక్రమించుకోవాలనే వైఖరికి చైనా స్వస్తి చెప్పనంత కాలం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే వుంటాయి. స్పష్టమైన సరిహద్దును నిర్వచించుకోడం కోసం భారత దేశంతో అది సహకరించవలసి వున్నది. అందుకు చర్చలే మార్గం.

## అమ్మతనానికి మాయని మచ్చ

కడప, డిసెంబర్ 31,14 ఏళ్ల క్రితం ఓ మహిళ... యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా నలుగురు పిల్లలు కూడా పుట్టారు. అయితే కొన్నాళ్ల క్రితం నుంచి ఆమెకు భర్తపై ప్రేమ తగ్గిపోయింది. ఈ క్రమంలోనే మరో యువకుడి పరిచయం ప్రేమగా, వివాహేతర సంబంధంగా మారింది. దీంతో ఇద్దరూ కలిసి ఇద్దరు పిల్లలను తీసుకొని పారిపోయారు. ఓ ఇల్లు అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే బాబు చిన్నవాడు కావడం, రాత్రిళ్లు తరచుగా ఏడుస్తుండటంతో.. తమకు ఏకాంతంగా గడిపే సమయం దొరకట్లేదని పిల్లాడిపై కోపంగా ఉన్నారు. అయితే ఓరోజు బాబు మరింత ఏడ్వడంతో కోపం పట్టలేని ప్రియుడి బాబుని కొట్టి చంపేశాడు. ఆపై ఇంటి ఆవరణలోనే గుట్టు చప్పుడు కాకుండా పూడ్చి పెట్టేశారు. చివరకు పోలీసులకు చిక్కారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన మారుతి నాయక్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఇతను 14 ఏళ్ల క్రితం బెంగళూరుకు చెందిన కవితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు పుట్టారు. వీరి కొన్నేళ్లుగా ప్రొద్దుటూరులో నివాసం ఉంటూ ఇటీవలే ఖాజీపేటలోని చెమ్మళ్లపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. లారీ డ్రైవర్‌గా పని చేసే మారుతి నాయక్ అదే వృత్తిలో ఉండే వినోద్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. తరచుగా వినోద్ వీరి ఇంటికి వస్తుండటంతో... కవితకు కూడా అతడితో స్నేహం పెరిగింది. ఈ స్నేహమే.. ప్రేమ, వివాహేతర సంబంధంగా మారింది. ఈ క్రమంలోనే మూడు నెలల క్రితం వినోద్, కవితలు ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటి నుంచి పరారయ్యారు. కొద్ది రోజుల పాటు అక్కడక్కడా తిరుగుతూ.. మూడు నెలల క్రితం బద్వేలులోని రూపంరాం పేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలు, భార్య కనిపించకుండా పోవడంతో మారుతి నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. కవిత, వినోద్ బద్వేల్ లో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని భర్త మారుతి నాయక్ కు చెప్పగా.. తన సోదరితో కలిసి కవిత ఇంటికి వెళ్లారు. విషయం గుర్తించిన వినోద్ అక్కడి నుంచి పరారయ్యాడు. పిల్లలను తీసుకొని నువ్వెందుకు వచ్చావని భర్త ప్రశ్నించగా అసలు విషయం తెలిపింది. ఆపై పాప ఒక్కతే కనిపిస్తోంది.. బాబు ఎక్కడని ప్రశ్నించగా... కవిత పొంతన లేని సమాధానాలు చెప్పింది. దీంతో అనుమానం వచ్చిన మారుతి నాయక్ బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అర్బన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 15 రోజుల క్రితం బాబు రాత్రి పూట ఎక్కువగా ఏడ్వడంతో.. తమ ఏకాంతానికి అడ్డుగా వస్తున్నాడని భావించిన వినోద్ రెండేళ్ల బాలుడి విపరీతంగా కొట్టాడని పోలీసుల విచారణలో తెలిసింది. ఈ క్రమంలోనే బాలుడు దెబ్బలను తట్టుకోలేక చనిపోయాడని.. దీంతో ఇద్దరూ కలిసి గుట్టు చప్పుడు కాకుండా అద్దెకు ఉంటున్న ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో మృతదేహాన్ని పూడ్చి పెట్టినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే కవితను అదుపులోకి తీసుకొని వినోద్ కోసం గాలిస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి, బాలుడు ఎలా చనిపోయాడో తెలుసుకునే పనిలో పడ్డారు పోలీసులు.

## 60 మందికి టిక్కెట్ డౌటే...

విజయవాడ, డిసెంబర్ 31, వచ్చే ఎన్నికల్లో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి తమ పార్టీకి చెందిన 151 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో దాదాపు 60 నుంచి 70 మందిని పక్కన పెట్టేయడం దాదాపు ఖరారైంది. చంద్రబాబులా జగన్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే వ్యక్తి కాదు. సర్వేల్లోనూ.. ప్రజాభిమానం పొందే విషయంలో వెనుకబడి ఉన్న ఎమ్మెల్యేలను నిర్దాక్షణ్యంగా తప్పించేసి వారి స్థానాల్లో కొత్త వ్యక్తులకు సీట్లు ఇవ్వనున్నారు. వచ్చే ఎన్నికలు జగన్కు చావోరేవో లాంటివి. మరోసారి కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితుల్లో ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలను మరోసారి గెలిపించుకోవడం కష్టం అన్న అభిప్రాయానికి జగన్ వచ్చేసారు. అందుకే ప్రజల్లో అభిమానం లేని ఎమ్మెల్యేలను పక్కనపెట్టి వారి స్థానాల్లో కొత్త వ్యక్తులకు టిక్కెట్ ఇస్తే అన్ని విధాల శ్రేయస్కరం అని... గెలుపు సులువు అవుతుందని జగన్ లెక్కలేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఏలూరు జిల్లా చింతలపూడి రిజర్వుడు నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే వీఆర్. ఎలీజాకు కూడా జగన్ షాక్ ఇవ్వటం దాదాపు ఖరారు అయింది. గత ఎన్నికల్లో గెలిచిన ఏడాది నుంచే ఎలీజాకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. చింతలపూడి శ్రీధర్ సొంత నియోజకవర్గం. వాళ్ల తండ్రి కోటగిరి విద్యాధరరావు ఇక్కడ నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో బలమైన అనుచరగణం ఉంది. ఎన్నోసార్లు జిల్లా పార్టీ నాయకత్వం నుంచి, పార్టీ కీలక నేతల మధ్య కూడా నియోజకవర్గంలో ఎంపీ, ఎమ్మెల్యే విబేధాలపై ఫిర్యాదులు,, పంచాయితీలు నడిచాయి. ఎలీజా ఎవ్వరి మాట వినకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో తన వర్గం వారిని ప్రత్యేకంగా పోటీ పెట్టించారు. అటు ఎంపీ వర్గం గత ఎన్నికలకు ముందు నుంచి పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తోంది. కొద్ది నెలల క్రితం గోదావరి జిల్లాల పార్టీ పరిశీలకుడిగా ఉన్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సైతం ఎంపీ గారికి టిక్కెట్ ఖరారైంది. మీ పనితీరుతో పాటు పార్టీ నాయకులతో మీ సమన్వయాన్ని బట్టే మీకు టిక్కెట్ ఉంటుందని ఎలీజాకు నేరుగానే చెప్పేశారు. అయినా కూడా ఎమ్మెల్యే తీరు మారలేదన్న నివేదికలు జగన్ దగ్గరకు చేరిపోయాయి. ఎలీజా ఇప్పటికీ కొన్ని వర్గాలతో పాటు కొంతమందినే కలుపుకుని వెళుతున్నారన్న ఆరోపణలు ఉండగా... పైకి ఈ అంశాలపై చాలా ఫిర్యాదులు కూడా వెళ్లిపోయాయి. రీసెంట్గా పార్టీ కీలక నేతలతో పాటు జగన్ చేయించిన రెండు సర్వేల్లో చింతలపూడిలో వైసీపీ చాలా బలంగా ఉంది. టీడీపీలో ఉన్న నాయకత్వ సమస్య, లుకలుకలతో పాటు అంతర్గత విబేధాలు అన్నీ పార్టీకి కలిసి వచ్చేలా ఉన్నాయి. ఎన్ని కష్ట పరిస్థితులు వచ్చినా కూడా టీడీపీ కంటే వైసీపీకే ఇక్కడ 4 శాతం ఎడ్జ్ ఉందన్నది క్లీయర్ కట్గా తేలిపోయిందట. అయితే ఎలీజాకే సీటు ఇస్తే మాత్రం పార్టీకి చాలా వర్గాలు దూరం కావడంతో పాటు పోల్ మేనేజ్మెంట్లో కీలకంగా పనిచేసే వర్గాలు అన్నీ దూరమవుతాయని.. చింతలపూడి సీటు చేజేతులా కోల్పోవాల్సి వస్తుందని తేలిందట. ఇద్దరిలో ఒకరు... ఎలీజాను తప్పించేసే విషయంలో సందేహాలే లేవు. అయితే ఆయన ప్లేసులో టిక్కెట్ ఎవరికి ఇస్తారన్న దానిపై రెండు పేర్లు ప్రముఖంగా వినిపిస్తాయి. నియోజకవర్గంలోని కామవరపుకోట మండలానికే చెందిన రవాణా శాఖ అధికారి విజయరాజు పేరు వినిపిస్తోంది. ఎంపీ వర్గంతో ఆయనకు మంచి సంబంధాలే ఉన్నాయి. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆయనకు వియ్యంకుడు కావడంతో పాటు ఎంపీ వర్గంతో ఎప్పటి నుంచో టచ్లో ఉండడం, స్థానికుడు కావడం.. బలమైన పరిచయాలు, ఆర్థిక అండదండలు ఆయనకు ప్లస్ కానున్నాయి. చాపకింద నీరులా విజయరాజు తన పని తాను చేసుకుపోతున్నారు. గోపాలపురం అనుకున్నా... అయితే ఇప్పుడు అనూహ్యంగా ఏపీ సీఐడీ చీఫ్ సునీల్కుమార్ పేరు కూడా లైన్లోకి వచ్చేసింది. సునీల్ కుమార్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారన్న టాక్ ఏడాదిన్నర నుంచే వినిపిస్తోంది. పైగా సీఎం జగన్కు అత్యంత ఇష్టుడు. ప్రస్తుతం ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన పేరు నిన్నటి వరకు గోపాలపురం రేసులో వినిపించినా.. ఇప్పుడు చింతలపూడి నుంచే తెరమీదకు వస్తోంది. సునీల్ కుమార్ కూడా ఇటీవల నియోజకవర్గంలో జరిగిన కొన్ని కార్యక్రమాలకు అటెండ్ అవ్వడంతో పాటు పార్టీ పరిస్థితిపై కూపీ లాగుతున్నట్టు టాక్ ? ఎలీజాకు అయితే నూటికి నూరు శాతం సీటు లేదు. మరి చింతలపూడి కొత్త వైసీపీ క్యాండెట్ ఎవరు అవుతారన్న దానిపై జగన్ ఎలాంటి డెసిషన్ తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది.

## గెలుపు కోసం జేసీ బ్రదర్స్... తహతహ



అనంతపురం, డిసెంబర్ 31, ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి అత్యంత కీలకం కావడంతోపాటు అభ్యర్థుల ఎంపిక కూడా పార్టీ విజయావకాశాలను ప్రభావితం చేస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వ్యూహాలు రచిస్తున్నారు. ఒకే కుటుంబంలో పలువురికి టికెట్లు నిరాకరించడంతోపాటు సరిగా పనిచేయనివారికి కూడా మొండిచెయ్యే చూపిస్తున్నారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున సీనియర్ నేతలు పలువురు తమ వారసులను నియోజకవర్గాల్లో రంగంలోకి దించారు. అయితే వారంతా ఓటమిపాలయ్యారు. మరోసారి వారిచేత పోటీచేయించాలనుకుంటున్నప్పటికీ చంద్రబాబు ఒప్పుకోవడంలేదు. కానీ కోవూరు నియోజకవర్గం నుంచి పోలంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి కుమారుడు దినేష్ రెడ్డికి మాత్రం టికెట్ ఖరారు చేయబోతున్నారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన జేసీ దివాకర్ రెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి సోదరులు తమ వారసులు జేసీ అస్మిత్ రెడ్డి, జేసీ పవన్ రెడ్డిని బరిలోకి దింపారు. గత ఎన్నికల్లో అనంతపురం ఎంపీ సీటు నుంచి దివాకర్ రెడ్డి తనయుడు పవన్ రెడ్డి పోటీచేసి ఓటమిపాలయ్యారు. అలాగే తాడిపత్రి నుంచి ప్రభాకర్ రెడ్డి వారసుడు అస్మిత్ రెడ్డి కూడా పరాజయం పాలయ్యారు. ఎన్నికలైన తర్వాత జేసీ పవన్ రెడ్డి ఎక్కువగా హైదరాబాద్ లోనే నివసిస్తున్నారు. చుట్టంచూపుగా అప్పుడప్పుడు నియోజకవర్గానికి వచ్చి వెళుతున్నారు. అలాగే అస్మిత్ రెడ్డి కూడా అప్పుడప్పుడు తాడిపత్రికి వచ్చిపోతుండటంతోపాటు బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ కార్యక్రమాలను కూడా నిర్వహించడంలేదు. దీంతో వీరిని నమ్మకొనివున్న పార్టీ శ్రేణులు పునరాలోచనలో పడ్డాయి. కార్యకర్తలు జారిపోయే ప్రమాదం ఉందని భావిస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో వారసులను పక్కనపెట్టి తామే నేరుగా బరిలోకి దిగాలని భావిస్తున్నారు. అనంతపురం నుంచి ఎంపీ అభ్యర్థిగా జేసీ దివాకర్ రెడ్డి, తాడిపత్రి నుంచి ప్రభాకర్ రెడ్డి పోటీచేయాలని నిర్ణయించారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కూడా ఇప్పటికే ఈసారి ఎన్నికల్లో మీరు పోటీచేయాల్సిందేనని, వారసులను పక్కన పెట్టాలని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరులను కలిగివున్న జేసీ సోదరులకు మూడున్నర సంవత్సరాలుగా గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ గా ప్రభాకర్ రెడ్డి కొనసాగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఓటమిపాలు కాగా తాడిపత్రిలో రాజకీయ వ్యూహాలతో ప్రభాకర్ రెడ్డి చైర్మన్ స్థానాన్ని దక్కించుకున్నారు. తమతోపాటు కొనసాగుతున్న అనుచరులను కాపాడుకోవడానికి, తాము బలోపేతం కావడంతోపాటు పార్టీని బలోపేతం చేయడానికి నేరుగా తామే రంగంలోకి దిగాలని ఈ సోదరులిద్దరూ నిర్ణయించుకున్నారు.

## రాజశేఖర్ రెడ్డి ఫోటోతో ఎన్నికలకు

విజయవాడ, డిసెంబర్ 31,మెగాస్టార్ చిరంజీవి సినిమాల్లో బిజీగా ఉన్నారు. రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు. తమ్ముడు పవన్ కల్యాణ్ రాజకీయంగా ఉన్నత స్థానాలకు వెళ్తారంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అన్నయ్యగా తన మద్దతు ఉంటుందని ఇప్పటికే హామీ ఇచ్చారు. అటు మెగాఫ్యాన్స్.. ప్రజారాజ్యం మాజీ నేతలు జనసేనకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రజారాజ్యం కాంగ్రెస్ లో విలీనం తరువాత చిరంజీవి కేంద్ర మంత్రిగా పని చేసారు. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. తనకు రాజకీయాలు సరిపడవని..సినిమాల పైనే తన ఫోకస్ అని స్పష్టం చేసారు. ఇదే సమయంలో ఏపీ కాంగెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేసిన వ్యాఖ్యలు ఆసక్తి కరంగా మరుతున్నాయి. చిరంజీవి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారని.. మెగాస్టార్ కాంగ్రెస్ వాదిగానే ఉంటానని అన్నారని గిడుగు రుద్రరాజు చెప్పుకొచ్చారు. సినిమాల్లో బిజీగా ఉండడం వల్ల పార్టీ కార్యక్రమాలకి హాజరవడం లేదని వివరించారు. ఇదే సమయంలో వైఎస్సార్ గురించి గిడుగు రుద్రరాజు కీలక వ్యాఖ్యలు చేసారు. రాజశేఖర్ రెడ్డి ఫోటో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ప్రచారానికి వెళ్తామన్నారు. దివంగత రాజశేఖర్ రెడ్డి తమ ముఖ్యమంత్రని చెప్పారు. పార్టీ నిర్ణయించే మేనిఫెస్టోతో పాటుగా వైఎస్సార్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారం చేస్తామని వివరించారు. రాజకీయాల్లో యువతకు అవకాశం ఇవ్వాలనేది పార్టీ ఆలోచనగా చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యంగా వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఏపీ విభజనకు కాంగ్రెస్ ఒక్కటే కారణం కాదని, 16 రాజకీయ పార్టీల ఒత్తిడి ఉందని గుర్తు చేసారు. కాంగ్రెస్ లో రాహుల్ గాంధీ జోడో యాత్ర ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందన్నారు. జనవరి 25, 26 తేదీల్లో రాహుల్ యాత్ర శ్రీనగర్ లో ముగుస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రజా పోరు నిర్వహిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ తొలి నుంచి ఏపీకి ప్రత్యేక హోదాకు కట్టుబడి ఉందని స్పష్టం చేసారు.

## తిరుమలలో దర్శనాల్లో మార్పులు లేవు

తిరుమల, డిసెంబర్ 31, శ్రీవారి ఆలయంలో మార్చి నుండి 6 నెలలపాటు స్వామివారి దర్శనం నిలుపుదల ప్రచారం అవాస్తమని.. టీటీడీ తెలిపింది. భక్తులు ఇలాంటి వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. యధావిధిగా మూలమూర్తి దర్శనం ఉంటుందని శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు శ్రీ వేణుగోపాల దీక్షితులు స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆనంద నిలయం బంగారు తాపడం పనుల కోసం స్వామివారి దర్శనాన్ని ఆరు నెలల పాటు నిలిపివేస్తారని కొన్ని ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలు వాస్తవం కాదన్నారు. టీటీడీ ఆగమ సలహామండలి సూచనల మేరకు తిరుమల శ్రీవారి ఆలయ ఆనందనిలయం బంగారు తాపడం పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేయాలని టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ఈ మేరకు బాలాలయం ఏర్పాటుకు ఆలయ అర్చకులు 2023, మార్చి1న తేదీన ముహూర్తంగా నిర్ణయించారు. ముందుగా వారం రోజులపాటు బాలాలయ నిర్మాణానికి అవసరమైన వైదిక క్రతువులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గర్భాలయంలోని మూలమూర్తి జీవకళలను కుంభంలోకి ఆవాహన చేసి బాలాలయంలో ఏర్పాటు చేసే దారు(కొయ్య) శ్రీ వేంకటేశ్వర స్వామివారి విగ్రహంలోకి ప్రవేశపెడతారు. ఆ తర్వాత ఆనంద నిలయానికి బంగారు తాపడం పనులు చేపడతారు. ఇందుకోసం పట్టే ఆరు నెలల సమయంలో గర్భాలయంలోని మూలమూర్తిని భక్తులు యధావిధిగా దర్శించుకోవచ్చు. బాలాలయంలోని దారు విగ్రహాన్ని కూడా భక్తులు దర్శించుకోవచ్చు. గర్భాలయంలో మూలమూర్తికి ఆర్జిత సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. గర్భాలయంలో మూలమూర్తికి, బాలాలయంలోని దారు విగ్రహానికి ఉదయం సుప్రభాతం నుండి రాత్రి ఏకాంత సేవ వరకు అన్ని ఆర్జిత సేవలు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి నిర్వహించే కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలన్నీ యధావిధిగా జరుగుతాయి. 1957–58వ సంవత్సరంలో ఆనంద నిలయానికి బంగారు తాపడం జరిగిన సందర్భంలో, 2018వ సంవత్సరంలో శ్రీవారి ఆలయంలో బాలాలయం నిర్వహించిన సందర్భంలో ఉన్న రికార్డుల ప్రకారం భక్తులకు శ్రీవారి మూలమూర్తి దర్శనం, ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం తదితర సేవలు నిర్వహించడం జరిగింది. వాస్తవం ఇలా ఉండగా, కొన్ని ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లో 6 నెలల పాటు శ్రీవారి మూలమూర్తి దర్శనం ఉండదని జరుగుతున్న దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## పెన్షన్లు.. నోటీసులు

విజయవాడ, డిసెంబర్ 31,పీలో పెన్షన్లను తొలగిస్తున్నారంటూ ప్రచారం మొదలైంది. ఇది అధికారులు నుంచే ప్రారంభమైంది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మాత్రమే అర్హులకు పెన్షన్‌ను అందిస్తామని అధికారులు చెబుతున్నారు. అందులో భాగంగా కొందరు నిబంధలకు విరుద్ధంగా ఉన్నారని అంటున్నారు. వారికి అధికారులు ఇటీవల నోటీసులు ఇచ్చారు. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు ఏపీలో చర్చనీయాశంగా మారింది. మెదటి దశలో దాదాపుగా లక్ష మందికిపై నోటీసులు అందాయని అంటున్నారు. అనర్హులుగా గుర్తించిన పెన్షన్‌దారులను సచివాలయ అధికారులు పిలిచి నోటీసులు ఇస్తున్నారు. రెండు కాపీలు ఇచ్చి ఒకటి సంతకం చేసి రిటర్న్ తీసుకుంటున్నారు. మరొకటి పెన్షన్‌దారుడికి అందిస్తున్నారు. నోటీసులు ఇచ్చిన తరువాత సచివాలయ అధికారులు మరి కొన్ని మెలికలు కూడా పెడుతున్నారు. నోటీసులు ఇచ్చినట్లుగా సంతకంతో కూడిన లేఖను లబ్ధిదారుడి నుంచి తీసుకోవటంతోపాటుగా అవసరం అయిన ధృవ పత్రాలను కూడా తీసుకురవాలంటూ ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో లబ్ధిదారుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. తమకు పెన్షన్ రాదేమో అనే అనుమానంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదే సమయంలో అధికారులు అడిగిన ధృవ పత్రాలను తీసుకువస్తే పెన్షన్ ఇస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. బాధితులు మాత్రం అధికారుల మాటలను ఎంత వరకు నమ్మాలో తెలియటం లేదని అంటున్నారు. పెన్షన్ దారులలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రద్దు చేస్తున్నారంటూ ప్రచారం మొదలవటంతో రాజకీయం కూడా అందులో దూరిపోయింది. ఈ విషయంలపై ఏపీలోని ప్రధాన రాజకీయ పార్టీలు అన్ని మండిపడుతున్నాయి. దశల వారీగా పెన్షన్ పెంచుతామని చెబుతున్న ప్రభుత్వం ఇప్పుడు లబ్ధిదారుల జాబితాలో కోత విధిస్తుందని ఆరోపిస్తున్నాయి. అనర్హులుగా చిత్రీకరించి పెన్షన్‌లో కొత విధించటంపై అన్ని పార్టీలు అభ్యంతరం చెబుతున్నాయి. ప్రభుత్వ అధికారులు ఇష్టానుసారంగా పెన్షన్‌దారులకు నోటీసులు ఇవ్వటంతో వారు ఆందోళనకు గురవుతున్నారని అంటున్నారు. ఇలాంటి చర్యలు వలన లబ్ధిదారుల్లో భయాందోళనలను రేకెత్తించేందుకు ప్రభుత్వం పరోక్షంగా అధికారులను వాడుకుంటుందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. దీని పై ఆందోళనకు సిద్ధం అవుతామని పార్టీలు హెచ్చరిస్తున్నాయి.

## ఎమ్మెల్యేలకు ఇంటి సెగ

గుంటూరు, డిసెంబర్ 31, వైనాట్ 175. వచ్చే ఎన్నికలకు సీఎం జగన్ నినాదం. మారుతున్న సమీకరణాలతో అమరావతి పరిధిలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అందులో మంగళగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు పోటీ ఖాయంగా కనిపిస్తోంది. అక్కడ వైసీపీ బీసీ కార్డుతో లోకేశ్ ను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. మరో నియోజకవర్గం తాడికొండ. అక్కడ పరిస్థితి ఇప్పుడు వైసీపీ ముఖ్య నేతల కే సవాల్ గా మారుతోంది. కొంత కాలంగా తాడికొండ వైసీపీలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సొంత పార్టీ నేతల మధ్య విభేదాలు బయటకు వస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా పార్టీ ఇంఛార్జ్ ల సమక్షంలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసనలు వినిపిస్తున్నాయి. అమరావతి పరిధిలోని తాడికొండ, తుళ్లూరు మండలాల వైసీపీ నేతలతో పార్టీ ముఖ్యులు సమావేశమయ్యారు. పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ గా ఉన్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పార్టీ నేతల నుంచి క్షేత్ర స్థాయి సమాచారం పైన ఆరా తీసారు. స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు ఎమ్మెల్యే శ్రీదేవి పైన నిరసన వ్యక్తం చేసారు. ఆ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడే ప్రయత్నం చేయగా కొందరు వ్యతిరేక నినాదాలు చేసారు. మాట్లాడుతుంటే అడ్డుకున్నారు. మరి కొందరు ఎమ్మెల్యేకు మద్దతుగా నిలిచారు. కొద్ది రోజుల క్రితమే నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కత్తెర సురేష్ తాడికొండ లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసారు. సురేష్ ను ఎమ్మెల్యే శ్రీదేవి మద్దతు దారులు అడ్డుకున్నారు. రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గతంలో ఎమ్మెల్యే డొక్క మాణిక్య వరప్రసాద్ ను తాడికొండ సమన్వయకర్తగా నియమించిన సమయంలోనూ ఎమ్మెల్యే వర్గీయుల నుంచి నిరసనలు వ్యక్తం అయ్యాయి. కొద్ది రోజుల పాటుగా డొక్కకు నియోకవర్గ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించటం పైన నిరసనలు కొనసాగించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలతో ఎమ్మెల్యే శ్రీదేవి సమావేశం తరువాత నిరసనలు నిలిచిపోయాయి.

## పండుగ పంచదార సంగతి ఏంటీ

శ్రీకాకుళం, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)పండగ నెలలోనూ అందరికీ రేషన్ అందే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు (ఎండియు) ద్వారా లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేస్తోంది. ఒకటో తేదీకి ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండగా జిల్లాలకు అంతంత మాత్రంగానే పంచదార, కందిపప్పు వచ్చాయి. ఈ పాటికే పౌరసరఫరాల గోదాములకు సరుకులు చేరాల్సి ఉండగా, అరకొరగా చేశాయి. డిసెంబర్ నెల ఆధారంగా ప్రభుత్వం కేటాయింపులు జరుపుతుందని అధికారులు చెప్తున్నారు. ఆ లెక్కల ప్రకారం చూసుకున్నా చాలా లోటు కనిపిస్తోంది. మరోవైపు పూర్తి స్థాయిలో సరుకులు అందుబాటులో లేకున్నా డిడిలు చెల్లించాలంటూ డీలర్లపై అధికారులు ఒత్తిడి చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.రాష్ట్రంలో 1,45,50,854 రేషన్ కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుదారునికీ అరకేజీ పంచదార అందించాల్సి ఉంది. ఈ లెక్కన 7,506.72 టన్నుల పంచదార కేటాయించాల్సి, ఉండగా 2,877.96 టన్నుల మాత్రమే జిల్లాలకు ప్రభుత్వం సరఫరా చేయగలిగింది. ఒక్కో కార్డుపై కేజీ కందిపప్పును అందించాల్సి ఉంది. ఈ లెక్కన 15,717 టన్నులను సరఫరా చేయాల్సి ఉండగా, 3,994 టన్నులు మాత్రమే కేటాయించింది. డిసెంబర్‌లో పంపిణీ ఆధారంగానే కేటాయింపులు ఉంటాయని చెప్తుండడంతో జనవరి నెలలోనూ పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందే పరిస్థితి కనిపించడం లేదు. శ్రీకాకుళం జిల్లాలో 6,58,257 రేషన్ కార్డుదారులకు సరఫరా చేసేందుకు 652 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. ఇప్పటివరకు 283 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. మరో 50 టన్నులు ఒకట్రెండు రోజుల్లో జిల్లాకు చేరనుంది. అయినా, ఇంకా 319 టన్నులు కావాల్సి ఉండడంతో ఆ మేరకు తమకు కందిపప్పు పంపాలని జిల్లా అధికారులు పౌరసరఫరాల కమిషనర్‌కు లేఖ రాశారు. మిగిలిన కందిపప్పు జిల్లాకు చేరడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన పలు సంస్థలు రాష్ట్రానికి కందిపప్పును సరఫరా చేస్తున్నాయి. కందిపప్పు సరఫరాకు టెండర్లను పిలవాల్సి ఉన్నా, ఇప్పటివరకు ప్రభుత్వం ఆ పని చేయలేదు. ఇదంతా జరిగే సరికి పంపిణీ సమయం ముగిసిపోతుందనే చర్చ జరుగుతోంది. పంచదార నిల్వల పరిస్థితీ అలానే ఉంది. జిల్లాకు 380 టన్నుల పంచదార అవసరం కాగా, 202 టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయిరేషన్ దుకాణాలకు కందిపప్పు, పంచదార సరఫరాకు డీలర్లు ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తారు. సరుకుల లభ్యత, వినియోగం ఆధారంగా డీలర్లు డిడిలు తీస్తారు. ఈసారి సరుకుల లభ్యత తక్కువగా ఉందన్న సమాచారంతో డిడిలు తీయడానికి డీలర్లు ఆసక్తి కనబర్చడం లేదు. అప్పు చేసి డిడిలు తీసిన సొమ్ము ప్రభుత్వం దగ్గర ఉండిపోతే తాము వడ్డీలు చెల్లించాల్సి వస్తుందనే ఆలోచనతో ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు రంగంలోకి దిగి డీలర్లకు ఫోన్లు చేయడంతోపాటు వాట్సాప్ సందేశాలు పంపిస్తున్నారు. పంచదార, కందిపప్పు కోసం విధిగా డిడిలు తీయాలని ఆదేశిస్తున్నారు. డిడిలు తీయని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరిస్తున్నారు. కందిపప్పు, పంచదార నిల్వలు ఎంఎల్ఎస్ పాయింట్లలో ఉన్నాయంటూ చెప్తున్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడంతో తాము కట్టిన సొమ్ములతోనే కందిపప్పు, పంచదారను కొనుగోలు చేసి సరఫరా చేస్తోందేమో అన్న చర్చ డీలర్లలో సాగుతోంది.

## కర్నూలు లో అయ్యప్పల ఆగ్రహజ్వాలలు

### అయ్యప్ప స్వామి ఆలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ

### గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్

### బైరి నరేష్ దిష్టి బొమ్మ దగ్ధం

### హిందువుల పై హిందుత్వం పై నోరు జారితే చేమోడాలు తిస్తం

కర్నూలు హిందూ దేవి దేవతల గురించి అయ్యప్ప స్వామి పుట్టుక గురించి తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా కొడంగల్ నందు అంబేద్కరిస్టులు నిర్వహించుకున్న బహిరంగ సభలో నాస్తికులమని బైరి నరేష్ అనే ఒక బృందం హిందూ దేవి దేవతల గురించి పురాణ ఇతిహాసాల గురించి వాటి నైతికతను ప్రాముఖ్యతలను అగౌర పరిచేవిధంగా కించపరచాలని ఉద్దేశం తో అసభ్య పదజాలంతో దూషిస్తూ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాలు అతని ప్రవర్తపై బగ్గుమన్నాయి ఈ విషయాన్ని ఖండిస్తూ కర్నూలు అయ్యప్ప భక్తులు అఖిల భారతీయ అయ్యప్ప ప్రచరదీక్ష సమితి విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ అధ్వర్యంలో లో భాస్కర్ నగర్ అయ్యప్ప స్వామి ఆలయం నుండి రాజ్ విహార్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ చేరుకొని గేటు ముందు బైరి నరేష్ దిష్టి బొమ్మ ను దగ్ధం చేశరు మేము హిందువులం మా మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎవరు మాట్లాడినా ప్రవర్తించిన చేమడలు తీస్తాం అంటూ అయ్యప్ప నామస్మరణతో భజనలతో నినధాలుచేస్తు బైరి నరేష్ పై చట్టపరంగా కటినమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు నగరం లోని నాలుగు పట్టణ పోలీస్ స్టేషన్ లల్లో ఫిర్యాదులు అందచేశరు ఎఫ్ ఐ అర్ చేయాలని స్లొగన్స్ చేశారు ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు కగ్గొలు హరీష్ బాబు, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ తుముకుంట ప్రతాప్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు గోరంట్ల రమణ, టిసి మద్దిలేటి, నాగరాజు, శివప్రసాద్, సుబ్రమణ్యం, భార్గవ్, సుధాకర్ గురు స్వామి, శంకరప్ప, జయా శేకర్, బాబు స్వామి, ధర్మ గౌడ్, భూషణ్ అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు మహేష్ మరియు గరు స్వాములు పాల్గొన్నారు

## సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గోనండి

### జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి

చిత్తూరు చిత్తూరు జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి, జిల్లాలోని ప్రజలందరికీ మరియు పోలీసు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. దేశంలో కోవిడ్ కేసులు వ్యాప్తి పెరుగుతున్నా నేపథ్యంలో ప్రజా భద్రత మరియు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలిని అయన అన్నారు.ఈ నూతన సంవత్సరము నందు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందోత్సవాలతో గడపవలనని ఆకాంక్షిస్తు ఈ శుభ దినాన జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది ప్రజలతో మమేకమై తమ తమ పరిధిలో గల సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలను సందర్శించి వారి సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవలసిందిగా సమాజహిత సామాజిక సేవాకార్యక్రమములో చురుగ్గా పాల్గొని జిల్లా పోలీసు ప్రతిష్టను ఇనుమడింప చేయాలని ఆదేశించారు.

## గంగాధరలో వింత వ్యాధితో అంతమైన కుటుంబం

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలో వింత వ్యాధితో ఒకే కుటుంబానికి చెందిన తల్లీ,ఇద్దరు చిన్నారులు ఇప్పటికే నెల రోజులలోపు మృత్యువాత పడగా శనివారం తెల్లవారుజామున కుటుంబ పెద్ద వేముల శ్రీకాంత్ మృతి చెందాడు. దీంతో ఓ కుటుంబమే అంతమైన తీరు మండలంలో సంచలనంగా మారింది.వివరాల్లోకి వెళితే.. గంగాధర మండల కేంద్రానికి చెందిన వేముల శ్రీకాంత్ అతని భార్య మమతతో కలిసి కుమార్తె అమూల్య, కుమారుడు అద్వైత్ ఎంతో అన్యోన్యంగా జీవించారు. ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ గా పని చేస్తూ శ్రీకాంత్ కుటుంబాన్ని పోషించగా ఎటువంటి బాధరబందీ లేకుండా బతికారు.ఎంతో హాయిగా జీవించిన కుటుంబంపై అంతు చిక్కని వింత వ్యాధి కన్నెర్ర చేసింది. దీంతో కేవలం 45 రోజుల వ్యవధిలో కుంటుంబమే పూర్తిగా అంతమైంది. ముందుగా వేముల శ్రీకాంత్ కుమారుడు అద్వైత్ వాంతులు, విరేచనాల భారిన పడి 20 నెలల బాలుడు నవంబర్ 16వ తేదీన మృతి చెందాడు.అవే లక్షణాలతో నవంబర్ 29 న అతని కూతురు, 5 ఏళ్ల చిన్నారి అమూల్య మరణించింది.ఆ తర్వాత చిన్నారుల కర్మకాండలు పూర్తి చేసుకుని ధర్మపురి గోదావరి స్నానం చేసి ఇంటికి చేరిన శ్రీకాంత్ భార్య వేముల మమత అవే లక్షణాలతో అనారోగ్యం భారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిసెంబర్ 18వ తేదీన తుది శ్వాస వదిలింది.అంతు చిక్కని వింత వ్యాధితో ఒకరి తర్వాత ఒకరు ఒకే కుటుంబంలో తల్లీ, బిడ్డ, కొడుకు మృత్యువాత పడడం ఆ కుటుంబంలో పెను విషాదం నింపగా గ్రామంలోనూ విషాదం అలముకుంది.రాష్ట్ర, జిల్లా

### వైద్యులకే సవాల్ గా మారిన వింత ఘటన

వ్యాప్తంగా సంచలనంగా మారి మృత్యు ఘంటికలు మె?గిన ఘటన ప్రజలు మరవక ముందే ఆ కుటుంబ పెద్ద, ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ వేముల శ్రీకాంత్ తన భార్య మమత కర్మకాండలు పూర్తి కాకుండా శుక్రవారం రాత్రి వాంతులు, విరేచనాలతో రక్తం కక్కుకోగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీకాంత్ శనివారం తెల్లవారుజామున కన్ను మూశాడు. కేవలం 45 రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి. భార్య, పిల్లల మరణంతో కలత చెంది శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా.? లేక వింత వ్యాధితో మరణించాడా.? అనే అంశం మిస్టరీగా మారింది. ఈ అంశం పోలీసుల విచారణలో తేలాల్సి ఉండగా, పలు రకాల వదంతులు వినిపిస్తున్నాయి. ఈ మరణాలకు అసలు కారణాలేంటో తెలియక జనం ఆందోళన చెందుతుంటే, మృతుల రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలకు పంపిన పరీక్షల్లోనూ వ్యాధి నిర్ధారణ కాక వైద్యులు ఏం తేల్చలేక పోతున్నారు. వైద్యులకే సవాల్ విసురుతున్న ఈ దిగ్భ్రాంధికరమైన ఘటనపై అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టారు... ఒకే కుటుంబంలో అందరు మృత్యు ఒడికి చేరడంతో ఇంత సైన్స్ అభివృద్ధి చెందినప్పటికీ ఎంతో మంది వైద్య నిపుణులు ఉన్నప్పటికీ అంతు చిక్కని వ్యాధితో మరణించడం ఓ మిస్టరీగా మారింది. ఈ సంఘటనతో పలువురు భయాందోళనలు చెందుతున్నారు...

## ఆదాయం...దర్శనాలు తిరుమల కొత్త రికార్డ్

తిరుమల, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం కోట్లమంది తిరుమలకు వెళుంటారు. శ్రీనివాసుడికి భక్తితో ముడుపులు, కానుకలు చెల్లిస్తారు. కోరిన కోరికలు తీర్చే ఆ వైకుంఠ వాసుడిని దర్శించుకుని జన్మ ధన్యమైందని భావిస్తారు. ప్రతిరోజు తిరుమల లోని ఆ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతూనే ఉంటుంది. అయితే గత రెండేళ్లు కరోనా కారణంగా భక్తులు అంతంతమాత్రంగానే స్వామివారిని దర్శించుకుంటున్నారు. 2020 మార్చి నుంచి ఆలయంలోకి భక్తులకు టీటీడీ అనుమతి నిరాకరించింది. దాదాపు 83 రోజులపాటు శ్రీనివాసుడికి ఏకాంతంగానే సేవలు నిర్వహించారు. ఆ తర్వాత కొవిడ్ నిబంధనల ప్రకారం పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించారు. ఈ ఏడాది కరోనా ప్రభావం తగ్గటంతో పూర్తిస్థాయిలో తిరుమల ఆలయంలోకి వెళ్లడానికి భక్తులకు అనుమతి ఇచ్చారు. 2022 ఉగాది నుంచి కరోనా నిబంధనలు పూర్తిగా తొలగించారు. దీంతో తిరుమలకు భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది స్వామివారిని రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. అలానే కానుకలు, ముడుపుల, హుండీ ఆదాయం కూడా రికార్డ్ స్థాయిలోనే సమకూరింది. సాధారణంగా టీటీడీ వార్షిక బడ్జెట్ హుండీ ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,116.25 కోట్లతో టీటీడీ బడ్జెట్ ను అంచనా వేసింది. తర్వాత దాన్ని రూ. 3,243. 19 కోట్లకు సవరించారు. ఇందులో శ్రీవారి హుండీ ఆదాయాన్ని రూ.1,231 కోట్లుగా అంచనా వేశారు.. అంచనాకన్నా 50 కోట్ల రూపాయలు అధికంగా భక్తులు హుండీలో సమర్పించారు. తద్వారా రూ.1,285 కోట్లు సమకూరింది. ఇవి కరోనా రాకముందు పద్దులు. కొవిడ్ వచ్చినప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. 2020-21వ వార్షిక సంవత్సరానికి హుండీ ఆదాయం 13 వందల కోట్లు అంచనా వేయగా.. టీటీడీ అంచనాలను తలక్రిందులు చేస్తూ 721 కోట్లు రూపాయల ఆదాయం మాత్రమే వచ్చింది. దీంతో వార్షిక బడ్జెట్ ను సవరించి రూ. 2,553 కోట్లకు కుదించారు. ఇక 2020-21 ఆర్థిక సంవత్సరానికి 2,837 కోట్ల రూపాయలు అంచనా వేశాయి పాలక వర్గాలు. 2021-22 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ పై సుదీర్ఘ చర్చ జరిపి ఆమోదం తెలిపింది. 21-22ఆర్థిక సంవత్సరానికి 2,937.85 కోట్ల రూపాయలకు పాలకమండలి సభ్యులు పచ్చజెండా ఊపారు.. కోవిడ్ తరువాత భారీగా భక్తుల సంఖ్య పెరగడంతో గతంలో మాదిరే హుండీ ఆదాయంతో పాటుగా, కళ్యాణ మండపాలు, కళ్యాణకట్ట, లడ్డూ విక్రయాలు, టీటీడీ భూములు లీజు వంటి రూపాల్లో ఆదాయం పెరిగింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది శ్రీవారిని దర్శించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరగటంతో పాటుగ హుండీ ద్వారా టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భక్తులు కానుకలు సమర్పించారు..ఈ క్రమంలో 2022 సంవత్సరానికి గాను శ్రీవారిని దర్శించుకున్న భక్తులు, హుండీ ఆదాయ లెక్కలను టీటీడీ విడుదల చేసింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 2,35, 58,325 కోట్ల మంది స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే రూ. 1446 కోట్లు హుండీ, విరాళాల రూపంలో వచ్చాయి. 1,08,51,706 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. 11,42,78,291 శ్రీవారి లడ్డులను భక్తులకు విక్రయించారు.

## 13 వేల గ్రామాల్లో బీజేపీ పాదయాత్ర

విజయవాడ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) ఏపీబీజేపీ నేతలు .. రాష్ట్రంలో తమదైన ముద్ర వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా రాష్ట్రంలోని 13 వేల గ్రామాల్లో పది వేల కిలోమీటర్ల మేర పాదయాత్రలు నిర్వహించాలని నిర్ణయంచారు. అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగనుంది. ఇటీవల వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంపై బీజేపీ నేతలు పోరాటం ఉధృతం చేస్తున్నారు. కేంద్ర మంత్రులు కూడా తరచూ ఏపీలో పర్యటిస్తున్నరు. జనవరి రెండో వారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా పర్యటించబోతున్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న సమయంలో బీజేపీ మరింత ఉధృతంగా కార్యకలాపాలను నిర్వహించాలనుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ బీజేపీ నేతలు గ్రామ, గ్రామానికి వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కేంద్ర బీజేపీ నుంచి వస్తున్న సూచనల మేరకు పాదయాత్రలకు రెడీ అవుతున్నారు. ఇలా చేయడం ద్వారా ప్రతీ గ్రామంలోనూ భారతీయ జనతా పార్టీ ఉనికిని చాటినట్లవుతుంది. బీజేపీపై అభిమానం ఉన్నప్పటికీ .. సంస్థాగతంగా లేని నిర్మాణం వల్ల కొంత మంది పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం లేదు. ఇలాంటి పరిస్థితిని పాదయాత్ర ద్వారా అధిగమించి గ్రామాల్లోని బీజేపీ అభిమానులను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఈ పాదయాత్రలను ఉపయోగించుకునే అవకాశం ఉంది. ప్రభుత్వంపై వ్యతిరేక పోరాటం చేయడం ద్వారా.. ప్రత్యామ్నాయం తామేనన్న భావన ప్రజలకు కల్పించేలా బీజేపీ పోరాటం ఉండనుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల బీజేపీ వినూత్నంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదారు వేల సభలను నిర్వహించింది. భారీ బహిరంగసభ జోలికి వెళ్లకుండా కాలనీలు.. గ్రామాల్లో ఈ సభలను నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి వంటి అంశాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రధాన పార్టీతో పోలిస్తే.. పార్టీ క్యాడర్ తక్కువే ఉన్నప్పటికీ.. ఉన్న క్రియాశీల కార్యకర్తలు, నేతలతోనే విస్తృతంగా నిర్వహించిన ఈ సమావేశాలపై మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. ఏపీ బీజేపీ ప్రధాన కారదర్శి విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో ఇవి జరిగాయి. పాదయాత్రల బాధ్యతలనూ ఆయనకే ఇచ్చే అవకాశం ఉంది. సోషల్ మీడియా బాధ్యతలను ఇప్పటికే ఆయనకు ఇచ్చారు. జాతీయ రాజకీయాలు లేదా ఇతర కారణాలు ఏమైతేనేం ఇంత కాలం ... బీజేపీ హైకమాండ్ పెద్దగా ఏపీలో బీజేపీ బలోపేతంపై పట్టించుకోలేదు.కానీ ఇటీవలి కాలంలో ఏపీ బీజేపీ నేతలకు వరుసగా టాస్క్‌లు ఇస్తున్నారు.. ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులు వరుసగా ఏపీకి వస్తున్నారు. అమిత్ షా కూడా వస్తున్నారంటే.. ఖచ్చితంగా ఏపీపై బీజేపీ హైకమాండ్ దృష్టి పెట్టిందని నమ్ముతున్నారు. ఇంత కాలం హైకమాండ్ పెద్దగా పట్టించుకోకపోతూండటంతో ఏపీ బీజేపీ నేతలకూ దిశానిర్దేశం లేకుండా పోయింది. ఇక ముందు అలాంటి పరిస్థితి ఉండదని.. .. తెలంగాణ తరహాలో పార్టీ ముందుకెళ్తుందనే విశ్వాసంతో ఆ పార్టీ నేతలున్నారు

## పెన్షన్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలలో కోతలు తగదు

### సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

కడప సిటి డిసెంబర్ 31 ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాల ద్వారానే వారి సమస్యలను పరిష్కరించుకోవాలని సిపియం కడప జిల్లా కమిటి కార్యదర్శి జి చంద్రశేఖర్ అన్నారు శుక్రవారం నగరంలోని ఆపార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ముందు గా తమ సిపియం పార్టీ తరపున జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రభుత్వం నుండి నిరాశే ఎదురవుతోందన్నారు . సంక్షేమ పథకాలు, నవరత్నాల క్రింద పంపిణీ చేస్తున్న సహాయంలో కోత వల్ల ప్రజలకు అందాల్సిన పూర్తి ప్రయోజనాలు అందడం లేదు. వయోవృద్ధులు, వితంతువులకు ఆదరువుగా ఉన్న పెన్షన్లలో కూడా కోతలు పెడుతున్నారు. పింఛనుదారుల పేర్లతో ఆస్థులు ఉన్నట్లు తప్పుడు రికార్డులు చూపించడం, సెంటు, సెంటున్నర ఉన్న భూములను కూడా విస్తీర్ణం పెంచి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. 300 యూనిట్ల కరెంటు వాడకం ఉంటే పెన్షన్ ఇవ్వబోమని అంటున్నారు. కుటుంబంలో ఒకరు ఏదో ఒక లబ్ధి పొందుతున్నారని వికలాంగులకు పెన్షన్ కోత పెట్టడం అన్యాయం. ప్రభుత్వాన్ని విమర్శించారని, ఓటు వేయలేదని, మరొక పార్టీకి చెందిన వారనీ కక్ష సాధింపులతో వేధించడానికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని బెదిరించడం పరిపాటిగా మారింది. అమ్మఒడి లబ్ధిదారులకు కూడా షరతులు పెట్టి 3.5 లక్షల మందికి కోత విధించారు. ట్యాబ్‌ల పంపిణీ పేరుతో మరో 5 లక్షల మందిని తగ్గిస్తున్నారు. అమ్మఒడి డబ్బులతో ట్యాబ్‌లు కొని కంపెనీలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారు. వీటన్నింటివల్ల రానున్న కాలంలో సంక్షేమానికి పెద్ద దెబ్బ తగులుతుందని సిపియం హెచ్చరిస్తున్నది. రేషన్ డిపోలలో సంక్రాంతి సందర్భంగా బియ్యంతోపాటు పండుగ సరుకులు పంపిణీ చేయాలి. రేషన్ సరఫరా కూడా అగమ్య గోచరంగా మారింది. కరోనా సమయం నుండి కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యంలో కూడా మోడీ ప్రభుత్వం కోతలు పెట్టడం దారుణం. గతంలో లాగే సంక్రాంతి, ఇతర పండుగల సందర్భంగా ఇచ్చే సరుకుల కిట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాము. పెన్షన్లు, ప్రజాపంపిణీ, సంక్షేమ పథకాల సమస్యలపై సిపియం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జనవరి 2వ వారంలో సచివాలయాల వద్ద రాయబారాలు, ధర్నాలు నిర్వహిస్తాము. ప్రభుత్వ దృష్టికి సమస్యల తీవ్రతను తీసుకెళ్తాము. నవంబరు 27నే ప్రారంభిస్తామన్న జగనన్న ఇళ్ళ పరిస్థితి అతీగతీ లేకుండా పోయింది.

## వైసిపికి ఓటమే



బ్రాహ్మణ కొట్కూర్ నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామంలో నంద్యాల టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకట్ రెడ్డి, ఆదేశాలతో నంద్యాల పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, అధ్యక్షతన ఈరోజు బ్రాహ్మణ కొట్కూర్ గ్రామ వార్డులలో టిడిపి నందికొట్కూర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు. గంటే పోగు జయాకర్, ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముస్లిం వర్గ ప్రజలను కలవడం జరిగింది. వైసిపి ప్రభుత్వం పాటిస్తున్నటువంటి వ్యతిరేక విధానాలను వివరించారు. అందులో భాగంగా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంటేపోగు జయాకర్, మాట్లాడుతూ అనేకమంది ముస్లిం సోదర సోదరీమణులు వైసిపి ప్రభుత్వ విధానాలను, పూర్తిగా విస్మరిస్తున్నారని, గత టిడిపి ప్రభుత్వ హయాంలో రంజాన్ పండగ నాటికి రంజాన్ తోఫా ఇచ్చేవారని అలాగే దుల్హన్ పథకం ద్వారా ఆడపిల్లలకు పెళ్లి చేసే భరోసా కల్పించారని, నేటి వైసిపి ప్రభుత్వం మాత్రం ముస్లింలకు ఎటువంటి పథకాలను ప్రవేశపెట్ట పోగా దుల్హన్ పథకాన్ని, నీరు కార్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వ విధానాలతో విసిగిపోయారని మన రాష్ట్రానికి పట్టిన ఈ కర్మను తొలగించు కోవాలంటే 2024లో ,నారా చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రి చేసుకోవడమే ఏకైక మార్గం అన్నారు. రాబోయే చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలకు ఎటువంటి అర్హత చూడకుండా దుల్హన్ పథకాన్ని తిరిగి పునరుద్ధరిస్తారని, తెలియజేయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం ఖలీలుల్లా బేగ్, సీఎం మా బేగ్, లక్ష్మీనారాయణ, చంద్రకంటి అనిల్ కుమార్, రామ్ లక్ష్మణ్, విజయ్, వడ్డే ఎల్లప్ప పాల్గొన్నారు.

## కలియుగ వెంకటేశ్వరుడికి కాసుల వరద

తిరుమల, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)కలియుగ వైకుంఠ వాసుడు, తిరుమల వెంకటేశ్వరుడికి 2022 సంవత్సరంలో భారీగా ఆదాయం వచ్చింది. కోట్ల రూపాయలతో హుండీ గలగలలాడింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి చివరి వరకు రూ.1,320 కోట్లు వచ్చిట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. శ్రీవారిని 2.35 కోట్ల మంది భక్తులు దర్శించుకోగా 1.08 కోట్ల మంది తలనీలాలు సమర్పించుకున్నారు. కాగా.. తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. భక్తుల సంఖ్య పెరగడంతో పాటు హుండీ ఆదాయం సైతం అదే స్థాయిలో పెరిగింది. కరోనా ఆంక్షలు ఈ ఏడాది మార్చి నుంచి తొలగించడంతో.. తిరుమలకు భక్తులు పోటెత్తారు.కొత్త సంవత్సరం, జనవరి 2న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల క్షేత్రానికి భారీగా భక్తులు తరలి రానున్నారు. దీంతో అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా వ్యాప్తి హెచ్చరికలతో వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు పలు సూచనలు చేశారు. వైకుంఠ ద్వారాన్ని 10 రోజుల పాటు తెరచి ఉంచనున్నారు. సుమారు 8 లక్షల మంది భక్తులకు స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం ఉంది. అయితే తిరుమల స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులందరూ మాస్కులు తప్పనిసరిగా ధరించారు. వ్యక్తిగత నియంత్రణ, శానిటైజేషన్ పాటించాలని సూచించారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉండొచ్చు

నెల్లూరు, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్)తెలంగాణలో పార్టీపై ఫోకస్ పెట్టిన తెలుగుదేశం అధినేత చంద్రబాబును టార్గెట్‌గా చేసుకొని కొన్ని రోజుల నుంచి వైసీపీ చేస్తున్ విమర్శలకు చంద్రబాబు కౌంటర్ ఇచ్చారు. తాను తెలుగు వారి కోసం పని చేస్తున్నానని అన్నారు. ఎక్కడైనా ఉంటానన్నారు. తెలుగు వారి కోసం ఎక్కడికైనా వెళ్తాను అన్నారు. తెలుగు జాతి కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశమని అన్నారు. సీఎం జగన్ పోకడలతో వైఎస్‌ఆర్‌సీపీలో అంతర్యుద్ధం మొదలైందన్నారు చంద్రబాబు. ఆ పార్టీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు వ్యతిరేక గాలి వీస్తోందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి వాటి డబ్బులను లాక్కున్నారని ఆరోపించారు. గ్రామాల్లో కనీసం వీధి లైట్లు పెట్టడానికి కూడా సర్పంచ్‌ల వద్ద డబ్బులు లేవని ఇలాంటి పార్టీలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు ఎదుకు ఉండాలని ప్రశ్నించారు. ఇలాంటి వారందరిలో ఆలోచన మొదలైందని.. అదేటైంలో ప్రజల్లో కూడా తిరుగుతు ఇప్పుడు స్టార్ట్ అయిందన్నారు చంద్రబాబు. రాబోయే రోజుల్లో మరింత చూస్తారంటూ హెచ్చరించారు. టీడీపీ సభలకు వస్తున్న జనాలు చూస్తుంటే వైసీపీకి, జగన్‌కు నిద్రపట్టడం లేదని కామెంట్ చేశారు. ఇది మరింత తీవ్రమవుతుందని అభిప్రాయపడ్డారు.వ్యతిరేకత ఇంకా పెరుగుతుందని భయపడి ఇప్పుడు ముందస్తు అంటూ డ్రామాలకు తెరతీయబోతున్నారని చెప్పారు చంద్రబాబు. ముందస్తుకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఢిల్లీ టూర్‌లో కేంద్రానికి చెప్పినట్టు టాక్ నడుస్తోందన్నారు. అసలు ఢిల్లీ వెళ్లినప్పుడు కనీసం రాష్ట్రానికి సంబంధించిన విషయాలు మాట్లడకుండా పూర్తి వ్యక్తిగత పర్యటన చేస్తున్నారని మండిపడ్డారు. అప్పట్లో ఊరూరా తిరిగి చెప్పిన ప్రత్యేక హోదా ఏమైందని ప్రశ్నించారు. పాతిక ఎంపీ సీట్లు ఇవ్వండి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తాను అన్న వ్యక్తి ఇప్పుడు కేసులు, బాబాయ్ కేసులో సోదరుడిని కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజాలను సరెండర్ చేశారన్నారు. పక్కరాష్ట్రంతో కూడా లాలూచీ పడి మూడు సీట్లు అమ్ముకొని రావాల్సివాటిపై నోరు విప్పకుండా సైలెంట్ అయిపోయారన్నారు.కర్నూలును న్యాయరాజధాని అన్నారని... టీడీపీ వ్యతిరేకమని దాడి చేయించడానికి యత్నించారని తెలిపారు చంద్రబాబు.

# మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు

**అన్ని పార్టీలకటౌట్ లను తొలగించాలి**

**టీడీపీ ఫ్లెక్సీ, కటౌట్ లను టార్గెట్ చేయడం మంచిపద్ధతి కాదు**

**టీడీపీ పట్టణ ఆర్గనైజర్ సెక్రెటరీ కటారి రాజేంద్ర. డి నరసింహులు, సలీం**

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలు, కటౌట్ ల తొలగింపు విషయంలో ఏకపక్షంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదని, ఓం శాంతి ఎంజీ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కటౌట్ ను మున్సిపల్ అధికారులు తొలగించలేదని, ఎక్కడ లేని నిబంధనలు ఎమ్మిగనూరు పట్టణంలో ఉండడం ఏమిటని టీడీపీ పట్టణ ఆర్గనైజర్ సెక్రెటరీ కటారి రాజేంద్ర. డి నరసింహులు జి సలీం ప్రశ్నించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో ఏ మున్సిపాలిటీ లేని ఫ్లెక్సీల, కటౌట్ ల ఏర్పాటు నిబంధనలు ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో మాత్రం అమలు అవుతుందని, గతంలో కొన్ని రోజుల నుంచి వైసీపీ నాయకులు ఫ్లెక్సీలను, కటౌట్ లను పెట్టుకుంటూ వచ్చారు మరి అప్పుడు ఈ నిబంధనలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న పట్టణంలో ఫ్లెక్సీల పేరుతో అనవసర రాజకీయాలు చేస్తున్నారన్నారని, ఎటువంటి సమాచారం లేకుండా సోమేశ్వర సర్కిల్ వద్ద మాజీ సీఎం చంద్రబాబు గారు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి గారి కటౌట్ ను మున్సిపల్ అధికారులు తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. జనవరి 4వ తేదీ తర్వాత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే వారు చలానా కట్టిన తర్వాత వాళ్లే ఫ్లెక్సీ ఎక్కడ పెట్టాలో లొకేషన్ ఇస్తామని మున్సిపల్ అధికారులు చెప్పడం చూస్తుంటే, మున్సిపల్ అధికారుల తీరును పట్టణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎన్నడూ లేని విధంగా ఎమ్మిగనూరు లో ఫ్లెక్సీ ల ఏర్పాటుకు కొత్త సంస్కృతిని తీసుకువస్తున్నారు, గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏనాడూ కూడా ఇలాంటి చర్యలకు పాల్పడలేదని ఆయన గుర్తు చేశారు. న్యూ ఇయర్, జాతర శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ పార్టీల నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే అనావయితీ ఎప్పటి నుంచో వస్తుంది, ప్రస్తుతం ఎమ్మిగనూరు మున్సిపల్ అధికారుల తీరును గమనిస్తుంటే జాతర కు అధికారం పార్టీకి మద్దతుగా ఉండి ఇతర పార్టీ నాయకులు ఎవరు కూడా ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టరాదని ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు జాతర సందర్భంగా ఫ్లెక్సీ ల ఏర్పాట్లు విషయంలో సమన్యాయంగా వ్యవహారించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కామర్తి మిన్నప్ప. 31 వ వార్డ్ ఇన్చార్జ్ దేవేంద్ర. 29వ వార్డు ఇన్చార్జ్ వడ్డే కృష్ణ. ఎన్టీఆర్. బాలకృష్ణ ఫ్యాన్స్ వై ఈరన్న. రమేష్ బాబు. నాగూర్ భాష తదితరులు పాల్గొన్నారు

# నంద్యాల జిల్లా లో నలుగురి పై పీడీ యాక్టు




**- నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి.**

నంద్యాల :-ప్రజా శాంతికి భంగం కలిగించి చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే నలుగురిపై పి.డి.యాక్టు కేసులు నమోదు గురించి జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘు వీర రెడ్డి, ఐపియస్ గారు శనివారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.రౌడీయిజం, గుండా, రాబరీ, డెకాయిటీ (దోపిడి), ల్యాండ్ గ్రాబర్ గా, బూట్ లెగ్గర్ గా, దాడులు, హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపు చర్యలు, దౌర్జన్యాలు చేస్తూ అలవాటు పడ్డ నేరస్థులుగా మారి క్రిమినల్ నేరాలు చేస్తున్న మొత్తం నలుగురిపై పిడి యాక్టులు నమోదు చేసి కడప సెంట్రల్ జైలు కి తరలించడం జరిగిందన్నారు. 1) కల్లూరి వెంకట సాయి వయసు: 27 సనీ,, తండ్రి: లేట్ వెంకటేశ్వర్లు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర , (రౌడి షీట్ సంఖ్య:132). ఇతని పై మొత్తం 13 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు .2) షేక్ మాలిక్ బాష తండ్రి: లేట్ షేక్ ఖాసిం వలి వయసు: 26 సనీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం (రౌడీ షీట్ నెంబర్: 137)ఇతని పై మొత్తం 08 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు .3) శ్రీ. దైవందీన్నే మౌలి కిశోర్ తండ్రి: దైవందీన్నే వెంకటేష్ వయసు: 24 సనీ,, ఇతని పై మొత్తం 05 కేసులు ఉన్నాయి.4) శ్రీ. దూదేకుల సుబాన్ వయసు: 23 సనీ,, తండ్రి: దూదేకుల మాబు , ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం : 174 షీట్ ను ఉయ్యాలవాడ పీ ఎస్ ఓపెన్ చేసినారు. ఇతని పై మొత్తం 05 కేసులు ఉన్నాయి. వీరందరూ సులభంగా డబ్బులు సంపాదించుకునే దురుద్ధేశ్యంతో చాలా రోజుల నుండి అలవాటు పడిన నేరస్థులుగా మారి ప్రజాశాంతికి భంగము కలిగించడం తో పాటు ప్రభుత్వం నిషేధించిన నాటుసారా , నిలువ, సరఫరా, అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్నారని వీరిపై పలుమార్లు క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినా కూడా వీరి ప్రవర్తనలో మార్పు రాలేదని ఈ విషయం పై నంద్యాల జిల్లా కలెక్టర్ గారికి ప్రతిపాదనలు పంపగా జిల్లా కలెక్టర్ గారు ఈ నలుగురి పై పిడి యాక్టు కు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు .ఈ నలుగురిని శనివారం నంద్యాల పోలీసులు అదుపులోకి తీసుకుని వీరిని కడప సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందన్నారు.

# నీరు . విద్యా. శానిటేషన్. పురపాలక ఆస్తుల అక్రమాల పై. పురపాలక లో వాడి వేడి చర్చ

నంద్యాల :- నీరు. విద్యా. శానిటేషన్. పురపాలక ఆస్తుల విషయం పై వాడి వేడిగా చర్చ జరిగింది. మున్సిపల్ ఛైర్ పర్సన్ మహాబున్నిసా అధ్యక్షతన తో కమిషనర్ రవి చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కౌన్సిల్ సాదారణ సమావేశం నిర్వహించారు . మున్సిపల్ హైస్కూల్ లో టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లను నియమించాలని పలువురు కౌన్సిలర్లు సభా ధ్రుష్టికి తీసుకుని వచ్చారు. దేవనగర్ కౌన్సిలర్ నీరు సరఫరా రోజు రావడం లేదని అధికారులను నిలదీశారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. బాలాజీ కాంప్లెక్స్ లో పార్క్ జోన్ లో నిర్మించిన భవనంపై వసూల్ రాజా అనే కథనానికి ఇప్పటివరకు ఆ విషయంలో వసూల్ రాజా లు అధికారులా, నేతలా తేల్చి చెప్పా లని డిమాండ్ చేశారు . ఎన్టీఆర్ కాంప్లెక్స్ లో గతంలో మిద్దె పైన హోటల్ ఏర్పాటు చేస్తే స్లాబ్ దెబ్బతింటుందని అప్పట్లో హటల్ మూయిం చారని . ఇప్పుడు అదే ప్రాంతంలో భారీ హోటల్ కు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. 12 వార్డు యందు రెండు పనులకు మంజూరైన నేటి వరకు పనులకు ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో అంతర్యమేమిటో చెప్పాలని కోరారు. నూనెపల్లి లో మంచినీటి పైపు లైన్ వేశారు కానీ ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ కృష్ణ మోహన కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు. అలాగే .పండుగల సమయంలో మంచినీటి సమస్య అధికంగా ఉందని సమస్య పరిష్కరించాలని కోరారు. నంద్యాల పట్టణంలో ఆక్రమనలపై స్పందించే మున్సిపల్ అధికారులు మున్సిపాలిటీకి చెందిన విలువైన స్థలాలను కాపాడాలని పట్టణంలోని హోసింగ్ బోర్డ్ కాలనీలో మున్సిపాలిటికి చెందిన 4.50 ఎకరాల భూమిలో కొందరు వ్యక్తులు ఈ స్థలం మాదేనంటూ బోర్డ్ ఏర్పాటు చేశారని మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని కౌన్సిలర్ మహబూబ్ బాషా కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు.అలాగే స్టేట్ బ్యాంక్ కాలనీలోని ఓ కళాశాల వద్ద రెండు ఎకరాల భూమిని కూడా కాపాడాలని కోరారు.నంద్యాల మున్సిపాలిటీ కి సంభందించిన భూములను గుర్తించి చుట్టూ కంచెవేయలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఛైర్మెన్ మాబున్నిసా ఆదేశించారు. అనంతరం కౌన్సిలర్లు కొత్త సంవత్సరం శుభ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.






# ముక్కెళ్ల గ్రామంలో మన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమం



తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని గల ముక్కెళ్ల గ్రామంలో పత్తికొండ నియోజకవర్గం ఇన్చార్జి కేఈ శ్యాం బాబు ఆదేశాల మేరకు మండల టిడిపి నాయకులు మన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు గ్రామంలో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి టిడిపి నాయకులు ప్రజలకు వివరించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ తీరు వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుగుదేశం పార్టీ నాయకులు వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెరిగిన వంట గ్యాస్ ధరలు,నిత్యవసర సరుకుల ధరలు,విద్యుత్ చార్జీలు వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరాలను సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో నిబంధన ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు దూరం చేస్తుందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,మాజీ సర్పంచ్ మునెప్ప,గౌరవ సలహాదారుడు రామచంద్ర, బూత్ కన్వీనర్ మల్లికార్జున,లక్ష్మణ స్వామి, రామయ్య తదితరులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతి బరిలో పోట్ల గిత్తలు



సంక్రాంతి ఫెస్టివల్ టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చాలా కీలకంగా కాబోతోంది. ఈ పండుగ సీజన్లో అగ్ర హీరోల సినిమాల ఒకే ప్రొడక్షన్ నుంచి వస్తూ ఉండడం హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వాల్తేరు వీరయ్య సినిమాతో పాటు నందమూరి బాలకృష్ణ వీర సింహారెడ్డి సినిమా కూడా సంక్రాంతికి భారీ స్థాయిలో విడుదల కాబోతోంది. ఒకరోజు తేడాతో రెండు చిత్రాలు వస్తున్నాయి. ఇక దాదాపు బాక్స్ ఆఫీస్ వద్ద ఈ రెండు సినిమాల మధ్య తీవ్రస్థాయిలో పోటీ నెలకొన్నట్లు అర్థమవుతుంది. అయితే ఎక్కువ స్థాయిలో మాత్రం వీరసింహారెడ్డి కాస్త పై చేయి సాధించే అవకాశం ఉన్నట్లు అనిపిస్తోంది.

## వీరసింహారెడ్డి,వాల్తేరు వీరయ్యలు

ఎందుకంటే ప్రస్తుతం డిమాండ్ మేరకు బాలయ్య సినిమాకు చిరంజీవి సినిమా కంటే ఎక్కువ స్థాయిలో థియేటర్స్ ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఇప్పటివరకు విడుదలైన సాంగ్స్ అయితే సినిమాలపై పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు అసలైన ట్రైలర్స్ విడుదల కావాల్సి ఉంది. వాల్తేరు వీరయ్య దర్శకుడు బాబి అలాగే వీరసింహారెడ్డి దర్శకుడు గోపీచంద్ ఇద్దరు కూడా ట్రైలర్స్ రెడీ చేసి ఉంచారు. ఇక ముందుగా జనవరి 4న మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య ట్రైలర్ విడుదల చేయడానికి డేట్ ఫిక్స్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఇక జనవరి 6వ తేదీన నందమూరి బాలకృష్ణ వీరసింహారెడ్డి ట్రైలర్ విడుదల చేయబోతున్నట్లు సమాచారం.రెండిటి మధ్యలో క్లాష్ రాకుండా నిర్మాతలు జాగ్రత్తలు అయితే బాగానే తీసుకుంటున్నారు. థియేటర్స్ లోకి మాత్రం వీరసింహారెడ్డి ముందుగా జనవరి 12వ తేదీన రాబోతోంది. ఇక వాల్తేరు వీరయ్య సినిమా జనవరి 13వ తారీఖున గ్రాండ్ గా విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. యాదృచ్ఛికంగా ఈ రెండు సినిమాలలో కూడా శృతిహాసన్ మెయిన్ హీరోయిన్ గా కనిపించడం మరొక విశేషం. మరి ఈ రెండు సినిమాలలో బాక్సాఫీస్ వద్ద ఏ సినిమా అత్యధిక స్థాయిలో ఓపెనింగ్స్ అందుకుంటుందో చూడాలి.

# ఈ వారం కూడా ఓటీటీ లో సందడే సందడి

ప్రతి వారం థియేటర్ల ద్వారా సినిమాలు ఎలా అయితే వచ్చి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేస్తున్నాయో అదే విధంగా ఓటీటీ ద్వారా సినిమాలు మరియు సిరీస్ లు ఇంకా షో లు వచ్చి సందడి చేస్తున్న విషయం తెల్సిందే. గత రెండు సంవత్సరాలుగా ఇండియన్ ప్రేక్షకులు ఓటీటీ కంటెంట్ ను వీకెంట్స్ లో తెగ ఎంజాయ్ చేస్తున్నారు.ఈ వారం కూడా వీకెండ్ లో ఎంజాయ్ చేసేందుకు గాను పలు సినిమాలు మరియు సిరీస్ లు షో లు ఉన్నాయి. తెలుగు లో అన్ స్టాపబుల్ షో తో బాలకృష్ణ వారం వారం కొత్త గెస్ట్ లతో అలరిస్తూ ఉన్నాడు. ఈ వారం బాలయ్య షో లో ప్రభాస్ సందడి చేశాడు. గత రెండు మూడు వారాలుగా ప్రభాస్ ఎపిసోడ్ కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు.ఎట్టకేలకు ప్రభాస్ ఎపిసోడ్ ను ఆహా ఓటీటీ స్ట్రీమింగ్ చేసింది. హీరో ప్రభాస్ ఎపిసోడ్ ను చూసేందుకు ఆహా ను ఒక్కసారిగా ప్రేక్షకులు లాగిన్ అవ్వడంతో యాప్ క్రాష్ అయ్యింది. ఇంకా తెలుగు ప్రేక్షకులు అన్ స్టాపబుల్ కాకుండా సినిమా లు సిరీస్ లను ఎంజాయ్ చేసే విధంగా ఓటీటీ లో కంటెంట్ రెడీ గా ఉంది.సౌత్ సూపర్ హిట్ మూవీ దృశ్యం 2 ను హిందీలో అజయ్ దేవగన్ రీమేక్ చేసిన విషయం తెల్సిందే. థియేట్రికల్ రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న హిందీ దృశ్యం 2 ను అమెజాన్ ప్రైమ్ స్ట్రీమింగ్ చేస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించిన మిలి సినిమాను నెట్ ఫ్లిక్స్ లో ఈ వారం ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు.విజయ్ సేతుపతి ముఖ్య పాత్రలో నటించిన తమిళ్ చిత్రం డీఎస్పీ నెట్ ఫ్లిక్స్ ద్వారా తెలుగు భాష లో కూడా అందుబాటులో ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ తప్పకుండా ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఓటీటీ లో ఈ చిత్రం ఘన విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది.ఇక అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించిన బటర్ ఫ్లై డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ వైవిధ్యభరిత థ్రిల్లర్ అనుపమ అభిమానులకు విందు భోజనం అనడంలో సందేహం లేదు. ఇక మలయాళం మూవీ గోల్డ్ కూడా ఈ వారంలోనే ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేసేందుకు స్ట్రీమింగ్ అయ్యింది. తెలుగు భాష లో కంటెంట్ కాస్త తక్కువ ఉన్నా కూడా ఇతర భాష సినిమాలను కూడా తెలుగు ప్రేక్షకులు సబ్ టైటిల్స్ తో చూసి ఎంజాయ్ చేసే వెసులుబాటు ఉంది. కనుక ఈ వారం కూడా ఓటీటీ లో సందడే సందడి.




# ఇన్‌స్టాలో న్యూ ఇయర్ విషెస్ చెప్పిన సమంత



టాలీవుడ్ స్టార్ నటి సమంత.. ఇటీవల 'యశోద' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన విషయం తెలిసిందే. నవంబర్ 11న విడుదలైన ఈ చిత్రం విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకుంది. కాగా, గత కొన్నిరోజులుగా మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూనిటీ డిసీజ్‌తో బాధపడుతున్న సమంత.. యశోద రిలీజ్ తర్వాత సినిమాలకు కాస్త విరామం తీసుకుంది. ఇంట్లోనే చికిత్స తీసుకుంటూ మయోసైటిస్ నుంచి కోలుకుంటోంది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా ఆమె సోషల్ మీడియాకు సైతం దూరంగా ఉంటూ వస్తోంది. ప్రస్తుతం కొత్త ఏడాదికి రెండు రోజులు మాత్రమే సమయం ఉడటంతో యాక్టివ్ అయ్యింది. ముందస్తు శుభాకాంక్షలతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులకు పలకరించింది. కొత్త లక్ష్యాలను నిర్ణయించుకుని కొత్త ఏడాదిలో వాటిని సాధించుకునేందుకు కష్టపడాలని అభిమానులకు సూచించింది. 'సులభమైన లక్ష్యాల కోసం నిర్ణయాలు తీసుకోవడానికి ఇదే సరైన సమయం. లక్ష్యాలను నిర్దేశించుకునే సమయంలో సాధ్యాసాధ్యాలను గమనించుకోవాలి. సులభమైన, మీరు చేయగలిగే లక్ష్యాలనే పెట్టుకోవాలి. ఆ దేవుడి ఆశీస్సులు మీకు ఎప్పుడూ ఉంటాయి. అడ్వాన్స్ హ్యాపీ న్యూ ఇయర్ 2023' అంటూ పోస్ట్ చేసింది. దీనికి నవ్వుతున్న ఓ ఫోటోను కూడా జత చేసింది. ప్రస్తుతం సామ్ పోస్ట్ నెట్టింట వైరలవుతోంది. ఇది చూసిన నెటిజన్లు సామ్ పోస్ట్‌కు రిప్లై ఇస్తున్నారు. కొందరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పగా.. మరికొందరు తన ఆరోగ్యం గురించి ఆరా తీస్తూ కామెంట్లు చేస్తున్నారు. సమంత ప్రస్తుతం 'శాకుంతలం', విజయ్ దేవరకొండ సరసన 'ఖుషీ' అనే ప్రేమకావ్యంలో నటిస్తోంది. వీటితోపాటు పలు బాలీవుడ్ ప్రాజెక్టులకు కూడా సామ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# ఆసీస్‌తో కీలక టెస్టు.. దూరమైన సౌతాఫ్రికా బ్యాటర్



ఆస్ట్రేలియాతో మూడో టెస్టుకు సౌతాఫ్రికా బ్యాటర్ థీనిస్ డి బ్రూయిన్ దూరం కానున్నాడు.మొదటిసారి తండ్రి కానున్న తరుణంలో బిడ్డను చూసుకునేందుకు స్వదేశానికి తిరిగి పయనం కానున్నాడు. ఈ విషయాన్ని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు శనివారం వెల్లడించింది. కాగా వరల్డ్‌టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2021-23లో భాగంగా డీన్ ఎల్గర్ బృందం ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది.ఇందులో భాగంగా మొదటి రెండో టెస్టుల్లో ఓడి చేదు అనుభవం మూటగట్టుకుంది. దీంతో ఇప్పటికే ఆతిథ్య ఆస్ట్రేలియాకు సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా.. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో మరింత వెనుకబడిపోయింది. ఆసీస్‌తో మిగిలిన ఒక టెస్టు, ఆ తర్వాత స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్ గెలవడం సహా టీమిండియా- ఆస్ట్రేలియా సిరీస్ ఫలితం తేలితేనే ఫైనల్ అవకాశాలపై క్లారిటీ వస్తుంది.ఈ నేపథ్యంలో ఆఖరిదైన సిడ్నీ టెస్టులోనైనా విజయం సాధించాలని ప్రొటీస్ పట్టుదలగా ఉంది. ఆసీస్- ప్రొటీస్ మధ్య జనవరి 4న మూడో టెస్టు ఆరంభం కానుంది. ఇక 30 ఏళ్ల బ్రూయిన్ విషయానికొస్తే.. గబ్బా టెస్టులో అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. మెల్‌బోర్న్‌లో ఆడే అవకాశం వచ్చినా దానిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. రాసీ వాన్ డెర్ డసెన్ స్థానంలో బాక్సింగ్ డే టెస్టులో ఆడిన బ్రూయిన్.. మొత్తంగా 40 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఆట పరంగా విఫలమైనా... వ్యక్తిగత జీవితంలో మాత్రం శుభవార్త అందుకోనున్నాడు.

## హిందువులందరూ సంఘటీతం కావాలి

హైదరాబాద్‌కూకట్పల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో బిజెపి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు నిర్వహిస్తున్న మహా పడిపూజలో తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొన్నారు. ఆలయంలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండి సంజయ్ మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు అని కోరుకునేది హిందూ ధర్మం. హిందూ ధర్మం పాటించే వారిలో నిస్వార్థం ఉంటుంది, అందరూ బాగుండాలని కోరుకుంటారు. హిందూ ధర్మాన్ని హేళన చేసే పరిస్థితి ఏర్పడింది. హిందూ ధర్మాన్ని, దేవుళ్లను కించపరిచేందుకు తెలంగాణ రాష్ట్రం అడ్డాగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190